ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అనంతపురం

జిల్లా వార్తలు

శనివారం 8 ఫిబ్రవరి 2025



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

అనంతపురం, రాప్తాడు, శింగనమల :9985411608
తాడిపత్రి, : 7659062646,
గుంతకల్లు, ఉరవకొండ, : 9985411657,
కళ్యాణదుర్గం, :9701120019,
రాయదుర్గం, : 9000406723,
ఏసీఎం: 9985411154

కన్నుల పండువగా...

కొనసాగిన సునామ జకినీమాత ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో సునామా జకినీ మాత, మల్యామ జకినీ మాత

గుత్తి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుత్తిఆర్ఎస్ రోడ్డులో వెలసిన అఖిల భారత ఆరెకటికల కులదేవతలు సునామ జకినీమాత, మల్యామ అమ్మవారి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేకువ జామునే అమ్మవార్లకు పంచామృతం, సుగంధ ద్రవ్య, పసుపు కుంకుమలతో అభిషేకాలు, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కన్యామణులు తెచ్చిన పూర్ణపాలకుంభాలలోని పాలతో అమ్మవారికి క్షీరాభిషేకం, పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఊరేగింపులో ఓ చిన్నారి డప్పు కొట్టడం ఆకర్షణగా నిలిచింది. వివిధ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్కారి ఆలూరు లక్ష్మణ్‌రావు, ఆలయ ధర్మకర్త సురేషరావు, మహిళా అధ్యక్షురాలు సరస్వతీబాయి, ప్రధానకార్యదర్శి భాస్కర్ రావు, అభిలాష్, వెంకట్‌రావు, ఈశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆటలతో ఆరోగ్యం: డీఐజీ షిమోషి

ముగిసిన పోలీసుల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్



ఓవరాల్ చాంపియన్ ట్రోఫీ అందుకున్న ఏఆర్ జట్టు

6

రండి.. దొంగతనానికి..!

చోరీలకు సేఫ్ జోన్.. అనంత

- ఇంటికి తాళం పడితే.. అంతే..!
- ఫిర్యాదు చేసినా స్పందించని పోలీసులు
- కేసులు కట్టినా.. రికవరీలు నామమాత్రమే
- పంచాయితీలపైనే స్టేషన్లలో శ్రద్ధ
- సీసీఎస్ విభాగం వైఫల్యంపై విమర్శలు

తాళం వేసిన ఇళ్లలోకి చొరబడవచ్చు. తాపీగా దోచుకుని వెళ్లొచ్చు. ఏటీఎంలను కొల్లగొట్టవచ్చు. డబ్బు ఎలా డ్రా చేయాలో తెలియనివారిని బురిడీ కొట్టించి.. కార్డులను మార్చేయొచ్చు. నింపాదిగా నగదు డ్రా చేసుకోవచ్చు. బైకులపై విహరిస్తూ.. మహిళల మెడలో గొలుసులను తెంచుకువెళ్లొచ్చు. మీ గురించి పోలీసులు పెద్దగా పట్టించుకోరు. కరుడుగట్టిన నేరస్థులు కానవసరం లేదు. ఇప్పుడిప్పుడే 'వృత్తి'లో ప్రవేశించినా.. పెద్దగా ఇబ్బంది ఉండదు. కాస్త తీరిక ఉంటే చాలు.. పగలు, రేయి.. ఎప్పుడైనా మీ పని మీరు చేసుకోవచ్చు. ఒకే ప్రాంతంలో పదే పదే దొంగతనాలు చేయొచ్చు. అనంతపురం జిల్లా.. దొంగలకు సేఫ్ జోన్..! కావాలంటే కొన్ని సంఘటనల వివరాలను ఇస్తున్నాం చూడండి..! ఇంకా నమ్మకం కుదరకపోతే.. పాత వార్తలను కూడా చదవండి..! ఆలయాల్లో హుండీలు, పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుల్, స్టార్టర్.. ఇలా నిత్యం ఏదో ఒకచోట చోరీలు జరుగుతూనే ఉంటాయి. కేసులు నమోదైనవి కొన్నే..! నమోదు కానివి చాలానే ఉంటాయి..!

- అనంతపురం/యాడికి (ఆంధ్రజ్యోతి)



రామ్‌నగర్‌లో రూ.28లక్షలు దోచుకెళ్లింది ఈ ఏటీఎంలోనే..

జనవరిలో చోరీలు..

- అనంతపురం నగర శివారులోని రాజహంస విల్లాస్‌లో 21వ తేదీన మూడు ఇళ్లలో దొంగలు చొరబడ్డారు. వెంకటశివారెడ్డి ఇంట్లో బీరువాను పగులగొటి రూ.20 లక్షల నగదు, ప్రత్యేక లాకరులో ఉంచిన రూ.1.50 కోట్ల విలువైన వజ్రాలు, బంగారు ఆభరణాలను ఎత్తుకుపోయారు. విద్యుత్ శాఖ డీఈ బోయపాటి శివశంకర్‌నాయుడు ఇంట్లో 4 తులాలు బంగారు ఆభరణాలు, వెండి సామగ్రి, రూ.65 వేల నగదు ఎత్తుకెళ్లారు. రంజిత్ ఇంట్లో రూ.5 తులాల బంగారు నగలు, నగదు దోచుకెళ్లారు.
- పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట గ్రామంలో రామేశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి ఇంట్లో 30వ తేదీన చొరబడ్డారు. 15 తులాల బంగారు, రూ.2లక్షల నగదు దోచుకెళ్లారు. మరుసటి రోజే చింతలపల్లి చౌడేశ్వరి ఆలయంలో వెండి ఆభరణాలు దోచుకెళ్లారు.
- యాడికి రజకవీధిలోని చలపతి ఇంటి తాళాన్ని 29న పగులగొట్టారు. ఇంట్లో చొరబడి, 13 తులాల బంగారు నగలను ఎత్తుకెళ్లారు.
- శింగనమల మండలం కల్లుమడిలో 23వ తేదీన రెండిళ్లలో చోరీ జరిగింది. నారాయణస్వామి ఇంట్లో 12తులాల బంగారు ఆభరణాలు, రామయ్య ఇంట్లో రూ.10వేలు నగదు చోరీ చేశారు.
- గుత్తి బీసీ కాలనీలో ఏడో తేదీన పట్టపగలే దొంగతనం జరిగింది. రాజేష్ అనే ఉపాధ్యాయుడి ఇంటిలోకి చొరబడిన దొంగలు, బీరువాలోని 15తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు ఎత్తుకెళ్లారు.
- తాడిపత్రి పట్టణంలోని శ్రీనివాసపురంలో ఉపాధ్యాయుడు వెంకటరామిరెడ్డి ఇంట్లో ఆరో తేదీన చోరీకి పాల్పడ్డారు. ఇంటికి వేసిన తాళాన్ని పగులగొట్టి 80 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు.

నార్పల మీద పడ్డారు..

- నార్పల మండల కేంద్రంలోని మసీదు కట్ట సమీపంలోని గాండ్ల ఓబయ్య ఇంట్లో ఐదు నెలల క్రితం దొంగలు పడ్డారు. 25 తులాల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. అదే రాత్రి ఆ ఇంటికి కొంత దూరంలో ఉన్న మరో ఇంట్లో ఐదుతులాల బంగారు ఆభరణాలు తస్కరించారు.
- రెండు నెలల క్రితం నార్పల మండల కేంద్రంలోని పులసలనూతల రాముడు అనే వ్యక్తి ఇంట్లో నాలుగు తులాల బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదు చోరీ చేశారు.
- గత ఏడాది నవంబరు 27న నార్పల ధూల్‌పేటలోని చాకలి సుధాకర్ ఇంట్లో ఒకటిన్నర తులం బంగారు, 20 తులాల వెండి ఆభరణాలు, రూ.లక్ష నగదు ఎత్తుకెళ్లారు.
- నార్పల మండల కేంద్రంలో వెంకటాంపల్లికి చెందిన శ్రీనివాసులు నుంచి రూ.3 లక్షలు కాజేశారు. ఎస్‌బీఐ బ్యాంకు నుంచి బయటకు రాగానే ఎత్తుకెళ్లారు. ఈ చోరీ నెలన్నర రోజుల క్రితం జరిగింది.

రెండిళ్లలో చోరీ

డిసెంబరు 10న ఉరవకొండలోని ఒకే భవనంలోని రెండిళ్లలో చోరీలు జరిగాయి. రైల్వే ఉద్యోగి ఇంట్లో చొరబడి 6తులాల బంగారు ఆభరణాలు, రూ.50వేలు నగదును ఎత్తుకెళ్లారు. మరో ఇంట్లో తులం బంగారు, రూ.10వేల నగదు చోరీ చేశారు.

రికవరీ పూర్..

దొంగతనాలను నియంత్రించడంలో పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. చోరీ చేసిన సొత్తు, డబ్బు రికవరీ చేయలేదని బాధితులు వాపోతున్నారు. నెలన్నర క్రితం అనంతపురం సీసీఎస్, రూరల్ పోలీసులు సంయుక్తంగా అంతర్రాష్ట్ర ముఠాను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.22 లక్షల విలువైన 31 తులాల బంగారు ఆభరణాలు రికవరీ చేశారు. 15 కేసులు ఛేదించామని పోలీసులు చెప్పారు. ఈ లెక్కన ఒక్కో కేసులో సగటున కేవలం 2 తులాల బంగారాన్ని మాత్రమే రికవరీ చేసినట్లు.

ఏటీఎంల కేసులు ఏమయ్యాయో..?

అనంతపురం నగరంలోని రామ్‌నగర్‌లో మూడు నెలల క్రితం ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ జరిగింది. అందులోని రూ.28 లక్షలు ఎత్తుకెళ్లారు. ఇది హర్యానా రాష్ట్ర దొంగల పని తేల్చారు. సీసీఎస్, నాలుగో పట్టణ పోలీసులు వారిలో కొందరిని పట్టుకున్నారు. కానీ కేవలం రూ.2లక్షల రికవరీనే చూపారు. కూడేరులో ఎస్‌బీఐ ఏటీఎంలోనే రూ.18లక్షలు ఎత్తుకెళ్లారు. దానిది కూడా అదే పరిస్థితి. గార్లదిన్నె మండలంలోని కల్లూరులో ఎస్‌బీఐ పక్కనే ఉన్న ఏటీఎంలో రూ.3.50లు చోరీ చేశారు. ఈ కేసులో కూడా ఎలాంటి పురోగతి లేదు.

కేసు కట్టకుంటే ఎలా..?

యాడికి మండల కేంద్రంలోని కమ్మవారి వీధిలో డిసెంబరు ఒకటో తేదీన దొంగలు పడ్డారు. వెంకటశివ అనే వ్యక్తి ఇంట్లో 16 తులాల బంగారాన్ని దోచుకెళ్లారు. బాధితుడు ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయలేదు. దీంతో ఎస్పీ కార్యాలయంలో వెళ్లి అర్జీ ఇచ్చాడు. అయినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. 'మా ఇంట్లో దొంగలు పడి 16 తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లారు. కేసు కట్టాలని పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నాను. అనంతపురం వెళ్లి ఎస్పీ కార్యాలయం గ్రీవెన్స్‌లో కూడా ఫిర్యాదు చేశాను. కేసు కట్టారా..? లేదా..? అనే సమాచారం కూడా ఇవ్వలేదు. నాకు ఇంతవరకు న్యాయం జరగలేదు. ఇలా అయితే పోలీసుల మీద ప్రజలకు నమ్మకం ఎలా వస్తుంది..? ఇంకోసారి ఎస్పీ కార్యాలయానికి వెళదామని అనుకుంటున్నాను..' అని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. వెంకటశివ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఊరికి వెళ్లిన సమయంలో చోరీ జరిగిందని అంటున్నారు. 'తలుపులు పగులగొట్టలేదు.. చోరీ జరిగిందన్న నమ్మకం ఏమిటి..?' అని పో లీసులు కేసు కట్టడం లేదట. అనుమానితుల వివరాలు చెప్పినా.. ఒత్తిళ్ల కారణంగా పోలీసులు గట్టిగా విచారించలేదనే ఆరోపణలు వస్తున్నాయి.



వెంకట శివ



పంచాయితీలపైనే శ్రద్ధ

జిల్లాలోని చాలా ప్రాంతాల్లో జరిగిన చోరీలు రికవరీలు కావడం లేదు. ఇందులో పాత కేసులు చాలానే ఉన్నాయి. పట్టణ ప్రాంతాలు, మండల కేంద్రాల్లో ఇవి అధికం. కొన్ని పోలీస్‌స్టేషన్లలో సీఐలు, ఎస్ఐలు పంచాయితీలపై చూపుతున్న శ్రద్ధ చోరీల రికవరీలపై చూపడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. డబ్బులొచ్చే విషయాలపై ఒకటికి నాలుగు సార్లు స్టేషన్‌కు పిలిపించి మరీ మాట్లాడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఐడీ, క్రైం, ప్రొటోకాల్ కానిస్టేబుళ్ల ద్వారా ఇలాంటి పంచాయితీలు నడుస్తున్నట్లు సమాచారం. రూ.10 వడ్డీ పేరుతో పీడించే వారికి సైతం పోలీసులు మద్దతునిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. బాధితులు సైతం రికవరీ కోసం ఎక్కువసార్లు అడిగే ధైర్యం చేయలేకపోతున్నారు.

సీసీఎస్ ఏం చేస్తోంది..?

క్రైమ్ కంట్రోల్ స్టేషన్(సీసీఎస్) పోలీసులు దొంగలను పట్టుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు మూటగట్టుకుంటున్నారు. ప్రతి నెలా జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో చోరీలు జరుగుతున్నాయి. నేరాలను నియంత్రించాల్సిన సీసీఎస్ పోలీసులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ విభాగంలో పనిచేసిన కొందరు సీనియర్ కానిస్టేబుళ్లకు దొంగలతోనే వ్యవహారం నడిపారనే ఆరోపణలున్నాయి. వారిలో సస్పెన్షన్ వేటుపడిన వారు సైతం ఉన్నారు. ఎవరైనా దొరికితే మీపై పెండింగ్‌లో ఉన్న కేసులు మోపుతామని బెదిరించి వారితో పైసలు వసూలు చేస్తారని సమాచారం. ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో సత్యసాయి జిల్లా ధర్మవరం ఘటనలో (కర్ణాటక చిక్‌బళ్లాపూర్ దొంగలు) బంగారం వ్యవహారంలో ఈ విభాగం పోలీస్ అధికారుల పాత్ర ఉందనే ఆరోపణలున్నాయి. ఇదివరకు డీఎస్పీ అధికారిగా ఉండేవారు. ఇప్పుడు ఇద్దరు సీఐలు మాత్రమే ఉన్నారు. ఈ విభాగం ఎప్పుడు చురుకుగా పనిచేస్తుందో మరి.

పాలకల్తీపై దర్యాప్తు జరపండి

సమగ్ర నివేదిక అందజేయండి

ఆహార భద్రత కమిషనర్‌కు లోకాయుక్త ఆదేశం

ఆంధ్రజ్యోతి కథనాలతో సుమోటోగా కేసు నమోదు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కల్తీ పాల దందాపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వరుస కథనాలకు లోకాయుక్త స్పందించింది. సుమోటోగా కేసు నమోదు చేసింది. సమగ్ర దర్యాప్తు జరిపి, నివేదిక సమర్పించాలని రాష్ట్ర ఆహార భద్రత కమిషనర్‌ను ఆదేశిస్తూ.. రాష్ట్ర ఉప లోకాయుక్త పి.రజని ఆదేశాలు జారీ చేశారు. రాప్తాడు మండలం బండమీదపల్లిలోని ఓ డెయిరీలలో పామాయిల్, ఉప్పు, మాల్టోడెక్స్‌ట్రిన్ పౌడర్ మిశ్రమాన్ని పాలలో కల్తీ చేస్తుండటం విజిలెన్స్ తనిఖీల్లో బయట పడింది. ఆ మరుసటి రోజే అనంతపురం నగరంలోని డెయిరీలు, మాల్టోడెక్స్‌ట్రిన్ విక్రయిస్తున్న సంస్థలలో విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. మాల్టోడెక్స్‌ట్రిన్, కల్తీ పాలు, ఇతర పదార్థాలను సీజ్ చేశారు. నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పాల కల్తీపై ఆంధ్రజ్యోతిలో ఈ నెల 4, 5, 6 తేదీలలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. వీటన్నింటినీ పరిశీలించిన రాష్ట్ర ఉప లోకాయుక్త తీవ్రంగా స్పందించారు. పాల కల్తీని అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు తెలియజేస్తూ, రాష్ట్ర ఆహార భద్రత కమిషనర్‌కు నోటీసులు జారీ చేశారు. కల్తీపాలతో జరిగే అనర్థాలను నోటీసులలో స్పష్టంగా పేర్కొంది. కేసు విచారణను మార్చి 24వ తేదీకి వాయిదా వేశారు.

నిరుద్యోగులకు భరోసాగా సబ్సిడీ రుణాలు

బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం

ఇంటర్వ్యూ interview



అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సబ్సిడీ రుణాలు నిరుద్యోగ యువతకు భరోసాగా నిలుస్తాయని బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇందుకు సంబంధించిన వెబ్‌సైట్ అందుబాటులో వచ్చిందని, అర్హులైన అన్ని కేటగిరీల వారు రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. త్వరలోనే మరిన్ని రుణాలు వచ్చే అవకాశముందని తెలిపారు.

ప్రశ్న: ఐదేళ్ల తరువాత మంజూరైన రుణాలకు స్పందన ఎలా ఉంది..?

జవాబు: ఐదేళ్ల తరువాత వచ్చిన రుణాలు కాబట్టి చాలా మంది నిరుద్యోగులు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ప్రతి అంశంపైన క్షుణ్ణంగా అవగాహన కల్పించాం. తొలి రోజు నుంచే వెబ్‌సైట్‌లో ఎలాంటి సమస్యలు లేవు. అంతా సజావుగా సాగుతోంది.

ప్రశ్న: రుణాల ఎంపిక ప్రక్రియ ఎలా జరుగుతుంది..?

జవాబు: దరఖాస్తులు చేసుకున్న అనంతరం కార్పొరేషన్ పరిధిలోని వారికి మున్సిపల్ కమిషనర్, మండలాల పరిధిలో అయితే ఎంపీడీఓల ఆధ్వర్యంలో ఉన్న కమిటీ ద్వారా ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. ఎంపికైన లబ్ధిదారుల జాబితాను వెరిఫికేషన్ చేసి కలెక్టర్‌కు పంపుతాం. అక్కడి నుంచి ఆమోదం పొందిన అనంతరం బ్యాంకర్ల వెరిఫికేషన్ జరుగుతుంది. అనంతరం లబ్ధిదారుల ఖాతాలకు రుణం జమవుతుంది.

ప్రశ్న: గతంలో మాదిరి సొసైటీలకు రుణాలు వచ్చే అవకాశం ఉందా..?

జవాబు: ఇప్పటి వరకూ వాటి మీద ఎలాంటి స్పష్టతా లేదు. బహుశా వాటిపైన కూడా త్వరలో క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. అదంతా పైస్థాయి అధికారుల నుంచి ఆదేశాలు రావాల్సిందే.

ప్రశ్న: ఆదరణ పథకం పునరుద్ధరిస్తారా..?

జవాబు: ఆదరణ పథకం ప్రస్తావన ఇంత వరకూ లేదు.

ప్రశ్న: మైనార్టీ కార్పొరేషన్‌కు ఇన్‌చార్జ్‌గా ఉన్నారు.. అక్కడ రుణాల పరిస్థితేంటి..?

జవాబు: మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి గతంలో అమలైన పథకాలు, యూనిట్లను అడిగారు. వాటిని సిద్ధం చేసి అధికారులకు నివేదికలు పంపాం. మైనార్టీ కార్పొరేషన్‌కు కూడా రుణాలు మంజూరు చేశారు. రూ.5 లక్షల యూనిట్లు, రూ.10లక్షల యూనిట్లు మంజూరయ్యాయి.

ప్రశ్న: క్రిస్టియన్ మైనార్టీల రుణాలు వచ్చాయా..?

జవాబు: క్రిస్టియన్ మైనార్టీలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 8 యూనిట్లు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన ఫైలును జిల్లా కలెక్టర్‌కు పంపారు. అక్కడి నుంచి ఆదేశాలు అందితే అందుకు సంబంధించి అవగాహన కల్పిస్తాం.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మేదర, కుమ్మరి, శాలివాహన కులాలకు చెందిన వారు సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మేదర, కుమ్మరి శాలివాహన కులాలకు చెందిన వారు ముగ్గురి నుంచి ఐదుగురి వరకు సంఘంగా ఏర్పడి రుణాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రుణం మొత్తం రూ.3 లక్షలు కాగా... సబ్సిడీ రూ. 1.50 లక్షలు వర్తిస్తుందన్నారు. ఆయా కులాలకు చెందిన వారు http-s://apob-mms.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆర్మ్‌డ్ గార్డు పోస్టుకు..

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా నంబుల పూలకుంట వద్దనున్న పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌లో ఆర్మ్‌డ్ గార్డు పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ శాఖాధికారి తిమ్మప్ప శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల మాజీ సైనికులు ఈనెల 11వ తేదీలోపు దరఖాస్తును అనంతపురంలోని జిల్లా సైనిక సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు 08554-241146 నంబరులో సంప్రదించాలన్నారు.

జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించనున్న పుస్తకావిష్కరణ సభను జయప్రదం చేయాలని అరసం జిల్లా కార్యదర్శి నానీల నాగేంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఏపీ అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా కవి జూపల్లి ప్రేమ్‌చంద్ రచించిన ఆధునిక తెలుగు వచన కవిత్వం-విభిన్న ధోరణులు పుస్తకాన్ని ఆవిష్కరిస్తారన్నారు.

రైతన్న సేవలో సొసైటీలు

మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్పు

- కామన్ సర్వీస్ సెంటర్ల ఏర్పాటు
- జనఔషధి కేంద్రాల నిర్వహణ
- పెట్రోలు బంకులతో ఆదాయం

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు రైతులకు రుణాలు మాత్రమే అందజేసిన సొసైటీలను బలోపేతం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. మరిన్ని సేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు, యంత్రాలు స్థానికంగానే అందుబాటులో ఉంచేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. అందులో భాగంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా(పీఏసీఎస్)లను మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్పు చేసేందుకు శ్రీకారం చుట్టాయి. అన్నదాతకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలను సొసైటీల ద్వారా నామమాత్రపు అద్దెతో అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. సొసైటీల కంప్యూటరైజేషన్ దాదాపుగా పూర్తి చేశారు. మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలను బలోపేతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. గత ఐదేళ్లలో నిరాదరణకు లోనైన సొసైటీలు కొత్త కళను సంతరించుకోనున్నాయి. అసలే నష్టాల్లో ఊగిసలాడుతున్న సొసైటీలకు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. యూఎన్‌ఓ ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ సమావేశంలో 2025 ఏడాదిని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించింది. ఈ క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకార వ్యవస్థను పటిష్ఠం చేయనున్నాయి. పూర్వం గ్రామీణ ప్రాంతాల్లో సొసైటీలు అందించిన తరహాలోనే అన్ని రకాల సేవలను అందుబాటులోకి తీసుకురానున్నాయి.

జిల్లాస్థాయిలో కమిటీల ఏర్పాటు

గత ఐదేళ్లలో నిర్వీర్యమైన సొసైటీలను పటిష్ఠం చేయడానికి సంస్థాగతంగా చర్యలు చేపట్టారు. కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్పు చేస్తున్నారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ) కన్వీనర్‌గా ఉండే కమిటీలో జేసీ, జడ్పీ సీఈఓ, పశుసంవర్థక శాఖ జేడీ, మత్స్యశాఖ డీడీ, డీపీఓ, నాబార్డు డీడీఎంతోపాటు ఆయా సమన్వయ శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు. సొసైటీల్లో ఆన్‌లైన్ సేవలను ప్రారంభించి, అక్రమాలను అరికట్టి, రైతులకు మెరుగైన, నాణ్యమైన, పారదర్శక సేవలు అందించేందుకు శ్రీకారం చుట్టింది. ఆధునిక వ్యవసాయ పరికరాలు, డ్రోన్లు రైతులకు అందుబాటులోకి రానున్నాయి.

గోదాముల నిర్మాణం

జిల్లాలో రైతులు పండించిన పంటలను భద్రపరుచుకునేందుకు గోదాములను నిర్మించారు. వాటిని మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీల ద్వారా నిర్వహించనున్నారు. ఇదివరకు రైతులు పండించిన పంటలను కాపాడుకునేందుకు, గిట్టుబాటు ధర కోసం ఎదురుచూసే సమయంలో ప్రైవేటు గోడౌన్లను ఆశ్రయించాల్సి ఉండేది. ఇకపై ఆ పరిస్థితులు ఉండకూడదనే ప్రభుత్వం సొంతంగా గోడౌన్లను నిర్మించి, నామమాత్రపు అద్దెతో రైతులకు అందుబాటులోకి తీసుకురానుంది. జిల్లాలో మొత్తం 101 గోడౌన్లకుగాను 54 నిర్మాణం పూర్తిచేసి, అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన 47 నిర్మాణ దశలో ఉన్నాయి. త్వరలో పూర్తిచేసేలా పనులు వేగంగా సాగుతున్నాయి.

కామన్ సర్వీస్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సేవలను రైతులు పొందేందుకు వీలుగా కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీలు) ఏర్పాటు చేయనున్నారు. మీసేవ కేంద్రాల తరహాలో అన్నిరకాల సేవలను అందించనున్నారు. మొబైల్ రీచార్జి మొదలుకుని విద్యుత్తు బిల్లులు, రవాణాకు సంబంధించి బస్సు, రైల్వే, విమాన టిక్కెట్ల బుకింగ్ ఇలా మొత్తం సీఎస్‌సీల ద్వారా అందించనున్నారు.

జనఔషధి కేంద్రాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రజలకు తక్కువ ధరకే జనరిక్ మందులు అందుబాటులో ఉంచేందుకు జనఔషధి కేంద్రాలుగా మార్పు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాకు ఆరు కేంద్రాలను మంజూరు చేశారు. జిల్లాకేంద్రంలోని డీసీఎంఎస్ ఆవరణలో ఇప్పటికే ప్రారంభించారు. మిగిలిన జన ఔషధి కేంద్రాలు ఆయా ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. రాచానపల్లి, ముచ్చుకోట, గుంతకల్లు, రాయదుర్గం ఉద్దేహాళ్, కళ్యాణదుర్గం చాపిరిలో ప్రారంభించనున్నారు.

పెట్రోలు బంకుల ద్వారా వ్యాపారం

మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీల ద్వారా పెట్రోలు బంకులు నిర్వహించి, ఆదాయం వచ్చేలా చేస్తున్నారు. రైతులకు రుణాలను అందిస్తూనే ఇలాంటి సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. జిల్లాకు మొదటి విడతలో 5 పెట్రోలు బంకులు మంజూరు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల పొలాలు, ఇతర రవాణాకు అవసరమయ్యే పెట్రోలు, డీజిల్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఇప్పటికే యల్లనూరులో ప్రారంభించారు. కణేకల్లు, నార్పల, ఆమిద్యాల, కూడేరులో ప్రారంభించేందుకు పనులు చేపడుతున్నారు.



యల్లనూరులో సొసైటీ నిర్వహిస్తున్న పెట్రోలు బంకును పరిశీలిస్తున్న సహకార శాఖ అధికారులు

ఎరువుల పంపిణీ కేంద్రాలుగా సొసైటీలు

రైతులకు స్థానికంగా వ్యవసాయ పనులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ ఆధునిక యంత్ర పరికరాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా ఏర్పాటు చేసి ఈ సేవలు అందించనున్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ యంత్ర పరికరాలు, డ్రోన్లను నామమాత్రపు అద్దెతో రైతులకు అందించేందుకు చర్యలు చేపట్టారు. రైతులకు తక్కువ ధరకే నాణ్యమైన విత్తనాలు అందించేందుకు, సీడ్ సొసైటీ, సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ఆర్గానిక్ సొసైటీ, రైతులు పండించిన పంటలను ఎగుమతి చేసేందుకు ట్రాన్స్‌పోర్ట్ సొసైటీలతో సహకార సొసైటీలను అనుసంధానం చేస్తున్నారు.

అనేక ప్రయోజనాలు



మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్పు చేయడంతో రైతులకు అనేక ప్రయోజనాలు కలగనున్నాయి. సొసైటీల కంప్యూటరీకరణతో పారదర్శక సేవలు అందనున్నాయి. ప్రజలకు చౌకగా సేవలు అందించడం, సొసైటీలను బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్రోలు బంకులు, జనఔషధి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. డ్రోన్ వంటి వ్యవసాయ సాంకేతిక ఆధునిక పరికరాలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు స్థానికంగానే వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉంచడమే మల్టీపర్పస్ క్రెడిట్ సొసైటీల ఏర్పాటు ప్రధాన ఉద్దేశం.

-అరుణకుమారి, జిల్లా సహకార శాఖాధికారి

మీ పనితీరుతో బ్యాంకు సర్వనాశనం

కంప్యూటరైజేషన్ పేరుతో రుణాల రెన్యువల్‌ను వదిలేస్తారా..?

బోర్డు సమావేశంలో జేసీ ఆగ్రహం



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మీ పనితీరుతో జిల్లా కేంద్ర సహకార బ్యాంకును సర్వనాశనం చేస్తున్నారని అధికారులపై జాయింట్ కలెక్టర్, ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి శివనారాయణ శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్టీఆర్ సహకారభవన్‌లో శుక్రవారం ఏడీసీసీ బ్యాంకు బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్‌లు, అంశాలు, సొసైటీల వారిగా ఆయన సమీక్షించారు. బ్యాంకు ఎన్‌పీఏ రోజురోజుకు పెరిగిపోతోందని, వసూలు చేసిన మొత్తాన్ని డిపాజిట్ చేయకుండా సొంతానికి ఎలా వాడుతారని ప్రశ్నించారు. 20-30ఏళ్ల నుంచి పని చేస్తున్న అధికారులు కనీస పురోగతి లేకుండా కాలక్షేపం చేస్తూ, జీతాలు తీసుకుంటే సరిపోదన్నారు. తదుపరి సమీక్షా సమావేశానికి ప్రోగ్రెస్ లేని వారిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కంప్యూటరైజేషన్ పేరుతో రైతుల పంట రుణాలు రెన్యువల్ చేయలేదని, కనగానపల్లి సొసైటీలో రూ.ఆరు కోట్లకు గాను ఒక్క పైసా కూడా రెన్యువల్ చేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పంట రుణాలు రెన్యువల్ చేయడంలో అధికారులు అందరూ ఫెయిల్యూర్ అంటూ అసహనం వ్యక్తం చేశారు. మేనేజర్లు, అధికారులు ఆఫీస్‌లో ఏసీల్లో కూర్చుని జీతాలు తీసుకుంటే కుదరదని, కచ్చితంగా క్షేత్రస్థాయికి వెళ్లాల్సిందే. రుణాలు రికవరీ చేయాల్సిందేనని హెచ్చరించారు. బుక్కరాయసముద్రం సొసైటీ పరిధిలో మార్ట్‌గేజ్‌లో ఉన్న భూములను ప్రభుత్వ అధికారులు కొనుగోలు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, సుమారు 25కి పైగా కేసులు ఉన్నట్లు సూచించారు. ఇటు బ్యాంకు, అటు సొసైటీలకు ప్రతి అంశంలోనూ పురోగతి వచ్చేలా పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణి, డీజీఎంలు రాంప్రసాద్, సుఖదేవబాబు, విజయచంద్రారెడ్డి, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు అవే అవార్డు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న విరుపాక్షకు అవే సంస్థ అవార్డు దక్కింది. అవే జాతీయ అవార్డుల ప్రదానోత్సవం గురువారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, అవే సంస్థ వ్యవస్థాపకులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి, మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్, తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి చేతుల మీదుగా కానిస్టేబుల్ విరుపాక్ష అవార్డును అందుకున్నారు. వివిధ శాఖల్లో నిజాయతీపరులైన అధికారులకు అవే సంస్థ అవార్డులు అందజేసింది. కళ్యాణదుర్గానికి చెందిన విరుపాక్ష గత 15ఏళ్లుగా కానిస్టేబుల్‌గా అనంతపురంలో పనిచేస్తున్నారు. అవే అవార్డు అందుకున్న విరుపాక్షకు పలువురు అభినందనలు తెలిపారు.



విరూపాక్షను అవార్డుతో సత్కరిస్తున్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, అవే వ్యవస్థాపకుడు వైకుంఠం ప్రభాకర్ చౌదరి

ఆటలతో ఆరోగ్యం: డీఐజీ

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024 విజయవంతంగా ముగిసింది. పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిమోషి, ఎస్పీ జగదీష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ పండుగ వాతావరణంలో జరిగిందని, క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డీఐజీ అన్నారు. చురుకుగా విధులు నిర్వర్తించేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. అధికారులు, సిబ్బందికి పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఎస్పీ అన్నారు. డిసెంబరు నెల చివరి రెండు రోజులు ఈ కార్యక్రమం నిర్వహించామని, కానిస్టేబుల్ ఉద్యోగ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కారణంగా ముగింపు కార్యక్రమం ఈ రోజు నిర్వహిస్తున్నామని అన్నారు. పోలీసు శాఖలో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, దేహదారుఢ్యం కలిగి ఉండటం చాలా ముఖ్యమని అన్నారు. రేంజ్, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలలో ప్రతిభ చాటాలని, జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, జ్ఞాపికలను డీఐజీ, ఎస్పీ అందజేసి, అభినందించారు. ముగింపు రోజు టగ్ ఆఫ్ వార్, 100 మీటర్లు, 5 కి.మీ. పరుగు పందేలు, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. టగ్ ఆఫ్ వార్ విన్నర్స్‌గా జిల్లా ఎస్పీ జట్టు, రన్నర్స్‌గా అదనపు ఎస్పీ జట్టు నిలిచాయి. ఓవరాల్ ఛాంపియన్‌గా ఏఆర్ పోలీస్ జట్టు నిలిచింది. వ్యక్తిగత విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌గా ఏఆర్ కానిస్టేబుల్ జయచంద్ర, హెడ్ కానిస్టేబుల్ సరోజ నిలిచారు. కార్యక్రమంలో తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి, ఏఎస్పీలు రమణమూర్తి, ఇలియాజ్ బాషా, డీఎస్పీలు శ్రీనివాసరావు, వెంకటేష్, రవిబాబు, శ్రీనివాస్, మహబూబ్‌బాషా, ట్రైనీ డీఎస్పీ ఆస్రాఫ్ అలీ, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ అధికారుల సంఘం నాయకులు త్రిలోక్‌నాథ్, జాఫర్, హరినాథ్, తేజ్‌పాల్, శ్రీనివాసులు నాయుడు, లక్ష్మీనారాయణ, సరోజ తదితరులు పాల్గొన్నారు.



పరుగు పందెంలో తలపడుతున్న పోలీసులు



టగ్ ఆఫ్ వార్‌లో పాల్గొన్న ఎస్పీ జగదీష్



పురుషుల విభాగంలో ఓవరాల్ చాంపియన్ జయచంద్రకు ట్రోఫీ అందజేస్తున్న డీఐజీ, ఎస్పీ



మహిళల విభాగంలో ఓవరాల్ చాంపియన్ సరోజకు ట్రోఫీ అందజేస్తున్న డీఐజీ, ఎస్పీ



పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజుతో సమావేశమైన ఎంపీ అంబికా

జిల్లాకు ప్రత్యేక ప్యాకేజీ నిధులివ్వాలి

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజుకి ఎంపీ అంబికా వినతి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అనంత జిల్లాకు ప్రత్యేక ప్యాకేజీ నిధులు మంజూరు చేయాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజుని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఢిల్లీలో శుక్రవారం ఎంపీల బృందంతో కలిసి జిల్లాకు సంబంధించిన ముఖ్య సమస్యలను అంబికా.. మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే రెండో జిల్లా అనంత కావడంతో ప్రత్యేక ప్యాకేజీ నిధులు మంజూరు చేయాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ అంశంపై పార్లమెంటులో చర్చించే అవకాశం కల్పించాలని కోరారు.

వైసీపీలో చేరిన మాజీ మంత్రి శైలజానాథ్



అనంతపురం, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ వైసీపీలో చేరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన డీసీసీ మాజీ జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డితో కలిసి వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. జగన్ సమక్షంలో వారిద్దరూ వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా శైలజానాథ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి, పార్టీ పదవికి రాజీనామా చేసి వైసీపీలో చేరానన్నారు. జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో పనిచేయాలనే నిర్ణయం తీసుకున్నానన్నారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. శైలజానాథ్ వెంట వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యేలు వై. విశ్వేశ్వరరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డితో పాటు కడప జిల్లాకు చెందిన ముఖ్య నాయకుడు వేంపల్లి సతీష్‌రెడ్డి ఉన్నారు.

నెట్టికంటి ఆంజనేయుడి సేవలో ముస్లిం దంపతులు

బంగారు నామాలు సమర్పణ



ముస్లిం దంపతులు సమర్పించిన నామాలు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామికి ముస్లిం దంపతులు బంగారు నామాలను శుక్రవారం అందజేశారు. అనంతపురానికి చెందిన రజియా, ఎస్ బాషా దంపతులు స్వామివారికి రూ.8లక్షల విలువచేసే 90 గ్రాముల బంగారు నామాలను ఆలయ ఉప ప్రధానార్చకుడు అనంతాచార్యుల ద్వారా అధికారులకు అందజేశారు. స్వామి వారికి మొక్కు తీర్చుకోవడంలో భాగంగా బంగారు నామాలు అందజేసినట్లు అధికారులు తెలిపారు.

జాతీయ రగ్బీ పోటీలకు ఎంపిక



కడపల రిత్విక

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ రగ్బీ పోటీలకు నగరానికి చెందిన కడపల రిత్విక ఎంపికైంది. ఈనెల 11వతేదీ నుంచి మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో నిర్వహించే ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి అండర్-15 రగ్బీ బాలికల పోటీల్లో రాష్ట్రం తరపున రిత్విక ప్రాతినిధ్యం వహించనుంది. స్థానిక సెయింట్ డీపాల్ స్కూల్‌లో రిత్విక ఆరో తరగతి చదువుతోంది. రిత్వికకు పలువురు అభినందనలు తెలిపారు.

గోడ కూలి ముగ్గురు విద్యార్థులకు గాయాలు

విడపనకల్లు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) మండలంలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం గోడ కూలి ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. పాఠశాల ప్రిన్సిపాల్ గంగాధర గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాఠశాలలో తాగునీటి కుళాయికి ఏర్పాటుచేసిన గోడ నీటి తేమకు తడిసిపోయింది. ముగ్గురు విద్యార్థులు కుళాయిల వద్దకెళ్లి తాగునీరు పట్టుకుంటుండగా గోడ ఒక్కసారిగా విరిగి విద్యార్థులపై పడింది. దీంతో చీకలగురికి గ్రామానికి చెందిన నవీన్ అనే విద్యార్థికి కాలు విరిగింది. రవీంద్ర, జగన్ అనే విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. నవీన్‌ను బళ్లారి ఆస్పత్రికి తరలించి, చికిత్సలు చేయించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

నేడు రాప్తాడు రైల్వే గేటు బంద్

రాప్తాడు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపానగల రైల్వే గేటును శనివారం బంద్ చేయనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. రైల్వే పై ఓవర్ పనుల మరమ్మతుల్లో భాగంగా గేటు తాత్కాలికంగా మూసి వేయనున్నట్లు తెలిపారు. రాప్తాడు నుంచి పంగల్ రోడ్డు మీదుగా అనంతపురానికి వాహన రాకపోకలు ఉండవన్నారు. వాహనదారులు ఈ విషయాన్ని గమనించి, ఇతర మార్గాల గుండా వెళ్లాలని సూచించారు.

ఎకరాకు 4 క్వింటాళ్లదాకా కంది కొనుగోలు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సీఎం యాప్ అప్‌డేట్ చేసిన నేపథ్యంలో ఎకరాకు 4 క్వింటాళ్ల దాకా కందులు కొనుగోలు చేస్తున్నట్లు ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని రైతు సేవాకేంద్రాల్లో 8వేల మంది రైతులు పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. ఇప్పటిదాకా 2వేల మెట్రిక్ టన్నుల కందులు కొనుగోలు చేశామన్నారు.
362 మంది రైతులకు రూ.3 కోట్లు సొమ్ము జమ చేసేలా బ్యాంకుకు పంపామన్నారు. తొలుత సీఎం యాప్‌లో ఎకరాకు 2 నుంచి 3 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చినట్లు చూపించిందన్నారు. ఉన్నతాధికారులు యాప్‌ను అప్‌డేట్ చేయడంతో ఎకరాకు 4 క్వింటాళ్లదాకా దిగుబడి వచ్చినట్లు చూపుతోందన్నారు. ఆ మేరకు ఎకరాకు 4 క్వింటాళ్లదాకా కందులు కొనుగోలు చేస్తామన్నారు. జిల్లాలోని రైతులు వెంటనే పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

క్రైం కార్నర్

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేంద్రరెడ్డి

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేసినట్లు నల్లమాడ సీఐ నరేంద్రరెడ్డి తెలిపారు. జిల్లాకేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను సీఐ వెల్లడించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి టౌన్ కోటకొండ ప్రాంతానికి చెందిన ముద్దం చంద్రశేఖర్ తన ఆరుగురు అనుచరులతో కలిసి గతంలో 10 చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. ఈ కేసుల్లో జైలు శిక్ష అనుభవించి గతనెల 20న విడుదలయ్యాడు. అయితే నేర ప్రవృత్తిని విడువక గత నెల26న కర్ణాటకలోని చింతామణిలో బైక్ దొంగిలించాడు. అదేరోజు నల్లమాడ మండలం డీచెర్లోపల్లిలో చైన్‌స్నాచింగ్, 27న ఉదయం బాగేపల్లిలో చైన్ స్నాచింగ్, మధ్యాహ్నం ఓడీచెరువు గ్రామం రెయిన్‌బో స్కూల్ వద్ద ఓమహిళ మెడలో బంగారుచైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ నరేంద్రరెడ్డి, సీసీఎస్ సీఐ శివాంజనేయులు, ఓడీచెరువు ఎస్సై మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం మధ్యాహ్నం మహమ్మదాబాద్‌క్రాస్ సమీపంలో అరెస్టు చేశారు. ఇతడి నుండి 44గ్రాముల బంగారం గొలుసులు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. చంద్రశేఖర్‌తో పాటు పలు చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడిన మరో నిందిడుతు పరారీలో ఉన్నాడని త్వరలోనే నిందితున్ని అరెస్టు చేస్తామని సీఐ పేర్కొన్నారు. దొంగను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి, రివార్డులను అందజేశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ముగ్గురు పిల్లలకు విషం ఇచ్చి..

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): భరణం విషయంలో మనస్తాపం చెందిన ఓ మహిళ ముగ్గురు పిల్లలకు విషద్రావకం ఇచ్చి, తాను తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఈ సంఘటన నగరంలోని ప్రియాంకనగర్‌లో శుక్రవారం రాత్రి జరిగింది. ప్రియాంకనగర్‌లో అనిత, పరమేష్ దంపతులు నివాసముండేవారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. ఏడాది కిందట విభేదాలతో వీరు విడిపోయారు. విడాకులు వచ్చాయి. రెండు నెలల కిందట పరమేష్ రెండో పెళ్లి చేసుకున్నాడు. అయితే భరణం విషయంలో అనితకు న్యాయం జరగలేదని తెలిసింది. ఈ క్రమంలో శుక్రవారం పెద్ద మనుషుల ఆధ్వర్యంలో పంచాయితీ చేశారు. అక్కడా తనకు న్యాయం జరగలేదని, ఇలా అయితే తాను, తన పిల్లలు ఎలా బతాకాలంటూ ఆవేదన వ్యక్తం చేసింది. ఈనేపథ్యంలోనే రాత్రి 7గంటల సమయంలో పిల్లలకు ఇచ్చి, తానూ విషద్రావకం తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వారిని వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం వారి పరిస్థితి మెరుగుపడిందని ఔట్‌పోస్టు సిబ్బంది తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు.

తొమ్మిది గంటలు ఇస్తాం: ఎస్ఈ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి తొమ్మిది గంటల విద్యుత్ ఇస్తామని ఎస్ఈ సంపత్ కుమార్ తెలిపారు. జిల్లా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కొన్ని ఫీడర్ల పరిధిలో వ్యవసాయానికి ఏడు గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా అవుతున్న వైనంపై 'సేకు చింత' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనికి విద్యుత్ శాఖ ఎస్ఈ స్పందించారు. రైతులకు ఇబ్బంది లేకుండా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ఈ మేరకు సంస్థ ఉన్నతాధికారుల నుంచి తమకు ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. సి-గ్రూపులోని ఫీడర్లకు కూడా తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తామని అన్నారు.

పాడుబడి పోయాయి..!

- శిథిలావస్థలో 50 పాఠశాల భవనాలు
- భయాందోళనలో తల్లిదండ్రులు

డి.హీరేహాళ్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో వందల కోట్లు వెచ్చించి నాడు-నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేస్తామని గొప్పలు చెప్పుకున్నారు. చాలా పాఠశాలలను పరిశీలిస్తే ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో అర్థమవుతుంది. గత ఐదేళ్లు పట్టించుకోకపోవడంతో మండలంలో చాలా పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆ పాఠశాలలను చూసిన తల్లిదండ్రులు ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. గదులు శిథిలావస్థకు చేరడంతో ఉపాధ్యాయులు పిల్లలను బయట కూర్చోబెట్టి పాఠాలు చెబుతున్నారు. మండలంలో 50 ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గత ప్రభుత్వంలో నాడు-నేడు పథకం కింద భవన నిర్మాణ పనులు మొదలుపెట్టి అర్థంతరంగా వదిలేశారు. కొన్ని పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. నూతన భవనాలు నిర్మించాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు గత పాలకులను, అధికారులను ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. మండలం కేంద్రం డి.హీరేహాళ్ కోట వీధిలో ఉన్న ప్రాథమిక పాఠశాల, పులకుర్తిలోని ప్రాథమికోన్నత పాఠశాల, మరికొన్ని పాఠశాలలు నిర్మించి చాలా ఏళ్లు కావడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. అవి ఏ క్షణమైనా కూలిపోయే ప్రమాదం ఉంది. పాఠశాలల దుస్థితి గురించి ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు దృష్టికి ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు తీసుకెళ్లడంతో.. పదిరోజుల క్రితం ఆయన స్వయంగా పరిశీలించారు. నూతన భవనాలు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.


డి. హీరేహాళ్‌లో శిథిలావస్థకు చేరుకున్న ప్రాథమిక పాఠశాల




శిథిలావస్థకు చేరిన పిల్లర్ల వద్ద భోజనం చేస్తున్న విద్యార్థులు

నూతన భవనం నిర్మించాలి



మండల కేంద్రంలోని కోటవీధిలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. నిత్యం ఆందోళనకు గురవుతున్నాం. ఇక్కడ 80 మంది దాకా విద్యార్థులు చదువుకుంటున్నారు. నిర్మించి చాలా ఏళ్లు కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. గతంలో చాలాసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు నూతన భవన నిర్మాణాల కోసం విన్నవించాం. ఈ విషయమై ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్వయంగా పరిశీలించారు. త్వరలోనే నూతన భవనాల నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు.

- దేవరాజ్‌నాయక్, ప్రధానోపాధ్యాయుడు, డి.హీరేహాళ్

భయాందోళనలతో చదువులు



నాడు-నేడు పేరుతో గొప్పలు చెప్పుకున్న వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదు. ఇందుకు నిదర్శనమే ప్రస్తుతం గ్రామాల్లో ఉన్న పాఠశాలల దుస్థితి. గత పాలకులు చేసిన పాపాలు నేడు విద్యార్థులను వెంటాడుతున్నాయి. కూలిపోయే భవనాల కింద భయాందోళనలతో చదువులు కొనసాగిస్తున్నారు. అధికారులు వెంటనే శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను పరిశీలించి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలి. త్వరితగతిన నూతన భవనాలు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలి.

-తిమ్మప్ప, మలపనగుడి

పూత దశలో మామిడి..!

- సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి
- అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఈసారి మామిడి పంట ఆలస్యంగా పూత దశకు చేరుకుంది. ఇప్పటి నుంచి అయినా తగిన సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. నవంబరు మాసాంతం వరకు కురిసిన వర్షాల వల్ల మామిడితోటలు ఆలస్యంగా పూత దశకు వచ్చాయి. సత్యసాయి జిల్లాలో అత్యధికంగా పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు, కదిరి, గాండ్లపెంట, తలుపుల, గోరంట్ల, తనకల్లు, ఓడీచెరువు, నల్లమాడ మండలాల్లో మామిడి సాగు చేశారు. జిల్లా మొత్తం మీద 20వేల హెక్టార్లలో మామిడి ఉన్నట్లు ఉద్యానశాఖ అధికారులు అంటున్నారు.

●పూత దశలో చేయాల్సినవి..

మామిడితోటలు వారం రోజులుగా పూతదశకు మారుతున్న దృష్ట్యా రైతన్నలు సరైన జాగ్రత్తలు పాటించాలని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. పూత, మొగ్గలు తొందరగా రావడానికి 13:0:45ను 7 గ్రాములతో పాటు ఏదేని సూక్ష్మధాతువు మిశ్రమం 2గ్రాములు లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలి. ఇది వరకే 13:0:45 పిచికారి చేసిన రైతులు 0:0:50 3గ్రాములు లీటరు నీటిలో కలిపి స్ప్రేచేయాలి. తేనె మంచు పురుగు కనిపిస్తే తోటలో ఇమిడాక్లోప్రిడ్ 0.3 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి అంటున్నారు. పూత, మొగ్గలపై మంచు వల్ల పూత నల్లగా మారిపోయి రాలిపోతుంటే హెక్సాకొనజోల్ 2 ఎంఎల్ లేదా తయోక్సినేట్‌మిథైల్ 1 గ్రాము 0.3 ఎంఎల్ ఇమిడాక్లోప్రిడ్‌తో కలిపి లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

● పూత, పిందె రాలకుండా..

50 శాతంపైన పూత వచ్చిన తోటలో ప్లానోఫిక్ 0.3ఎంఎల్‌తో పాటు థయోమిథాక్సామ్ 0.3 గ్రాములు ఒక లీటర్‌నీటిని కలిపి పిచికారి చేసుకోవాలి. 75 నుంచి 100 శాతం పూత, 10 శాతం పిందె వచ్చిన తోటలో సైనోసాడ్ 0.3 ఎంఎల్ లీటరు నీటికి పిచికారి చేసుకుంటే పంటను సంరక్షించుకోవచ్చని చెబుతున్నారు.


కంబాలపర్తి వద్ద విరగబూసిన మామిడి పూత

● పండు ఈగ నివారణకు..

మామిడి కాయలును ఆకర్షించి, రైతులను నష్టపరిచే పండుఈగ నివారణ చర్యలు ఇప్పటి నుంచే చేపడితే అధిక దిగుబడి సాధించవచ్చు. పండుఈగను ఆకర్షించే బుట్టలు లేదా టాబ్లెట్స్ మిథైల్ యూజినాల్ టాబ్లెట్ లేదా జెల్ ఎకరాలో 5 బుట్టలు అమర్చుకోవాల్సి ఉంటుంది. దీని ద్వారా పండుఈగను నివారించి పంటను కాపాడుకోవచ్చు.

కాపాడుకుంటే.. అధిక దిగుబడులు

- చంద్రశేఖర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

గత వారం రోజులుగా జిల్లాలో మామిడితోటలు పూతదశకు వచ్చాయి. ప్రస్తుతం మామిడిపూత ఆశాజనకంగా ఉంది. పూత పిందె దశలో సరైన సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చు. మామిడిపంట సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులపై మామిడితోటల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి రైతులకు సూచనలు ఇస్తున్నాం.

ఇబ్బందులుంటే సంప్రదించండి

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్



మాట్లాడుతున్న శివప్రసాద్ యాదవ్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జనన, కుల, వివాహ, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో న్యాయపరమైన ఇబ్బందులుంటే న్యాయసేవ అధికార సంస్థలను సంప్రదించాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ సూచించారు. జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్, పంచాయతీ వార్డు అడ్మిన్లు, రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ధ్రువీకరణ పత్రాలను జారీ చేయడంలో ఆలస్యం లేకుండా త్వరితగతిన అవసరమైన వారికి అందజేయడానికి ఉన్న పరిస్థితులను వివరించారు. అనంతరం శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉన్న శాశ్వత లోక్ అదాలత్ వలన న్యాయపరమైన పరిష్కార మార్గాలను వివరించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఇటికే నల్లప్ప, ఉద్యోగులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి పోస్టర్ల ఆవిష్కరణ


సేవాలాల్‌జయంతి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టరు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల పోస్టర్లను కలెక్టరు వినోద్‌కుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో సేవాలాల్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు కలెక్టరును కలిసి వేడుకల నిర్వహణపై చర్చించారు. వేడుకలకు హాజరు కావాలని కలెక్టరును ట్రస్టుసభ్యులు ఆహ్వానించారు. అనంతరం ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ చేత ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో ట్రస్టుసభ్యులు అశ్వత్థనాయక్, బాలానాయక్, చక్రానాయక్, బాలాజీనాయక్, రంగానాయక్ పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలకు హాజరుకండి: ఐసీడీఎస్ పీడీ

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ అంగన్‌వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు ఈనెల 11నుంచి 14 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మి శుక్రవారం ఓప్రకటనలో తెలియచేశారు. జిల్లాలోని 11 సీడీపీఓ ప్రాజెక్టులలో ఖాళీగా ఉన్న పోస్టులకు 309 దరఖాస్తులను స్వీకరించగా. వివిధ కారణాలతో 116 తిరస్కరించినట్లు వెల్లడించారు. మిగిలిన 193 మంది అభ్యర్థులకు సంబంధించి ఆయా రెవెన్యూ డివిజన్ ప్రధాన కార్యాలయాల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

చీనీ టన్ను రూ.20వేలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.20వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరి రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 35 టన్నుల చీనీ కాయలు వచ్చాయన్నారు.

904 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శుక్రవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 904 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 465 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు.

ఫైనల్ డేటా..!

మొత్తం టీచర్ల సీనియారిటీ జాబితా తయారీకి కసరత్తు

- విద్యాశాఖ చరిత్రలో ఇదే తొలిసారి
- 16,000పైచిలుకు టీచర్ల డేటా సేకరిస్తున్న వైనం
- ఇదే ప్రామాణికంగా బదిలీలు, ఉద్యోగోన్నతులు
- జాబితా తయారీకి ఈనెల 10 వరకూ గడువు
- మూడురోజులుగా ఉమ్మడి జిల్లా అధికారుల కుస్తీ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో మునుపెన్నడూ లేని విధంగా ఉపాధ్యాయుల వివరాలు సేకరిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ చరిత్రలోనే తొలిసారి అందరు టీచర్ల సీనియారిటీ జాబితాను తయారు చేసేందుకు సిద్ధమయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16,000 మందికి పైగా ఉపాధ్యాయుల వివరాలు సేకరిస్తున్నారు. వాళ్ల సీనియారిటీ జాబితాను సిద్ధం చేసేందుకు అధికారులు తలమునకలయ్యారు. జాబితా తయారు చేసేందుకు ఈ నెల పదో తేదీ వరకు మాత్రమే విద్యాశాఖ డైరెక్టరే గడువు ఇవ్వడంతో జిల్లా విద్యాశాఖ అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మూడు రోజులుగా ఉదయం నుంచి రాత్రి వరకూ పోరాడుతున్నారు. సెలవు దినాలైన శనివారం, ఆదివారం కూడా దీనిపైనే అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా విద్యాశాఖాధికారులు కసరత్తు చేయనున్నారు.


టీచర్ల వివరాల సేకరణ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

చరిత్రలో తొలిసారి...

కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీల కోసం ప్రత్యేక చట్టం తీసుకొచ్చేందుకు సన్నద్ధం అవుతోంది. అసెంబ్లీలో చర్చించి ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చేందుకు రెడీ అవుతోంది. దీని కోసం అన్ని కేటగిరీల ఉపాధ్యాయుల సమగ్ర సమాచారాన్ని సేకరించి ఆన్‌లైన్‌లో ఉంచనున్నారు. దీని ఆధారంగా భవిష్యత్తులో ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించనున్నారు. తర్వాత ఎప్పటికప్పుడు ప్రతి నెలా విద్యాశాఖాధికారులే టీచర్ల వివరాలను అప్‌డేట్ చేయనున్నారు. వాటి ఆధారంగా టీచర్లకు అన్ని రకాల బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించేలా చర్యలు తీసుకోనున్నారు. దీర్ఘకాలిక ప్రయోజనాల ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, విద్యాశాఖ అడుగులేస్తున్న నేపథ్యంలో టీచర్ల సీనియారిటీ జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా ఉండేందుకు కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని 63 మండలాల పరిధిలో పనిచేసే 16,000 పైచిలుకు టీచర్ల నుంచి సమాచారాన్ని తీసుకుంటున్నారు.

కొందరు ఇష్టారాజ్యంగా...

ఇప్పటికే టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(టిస్) ద్వారా వివరాలు తీసుకున్నారు. కొంత మంది టీచర్లు తమ సొంత సమాచారాన్నే(పర్సనల్ డేటా) ఇష్టా రాజ్యంగా నమోదు చేయడంపై విద్యాశాఖాధికారులు పెదవి విరుస్తున్నారు. కొందరు టీచర్లు వాళ్ల పనిచేస్తున్న జడ్పీ, మున్సిపాలిటీ, మండల పరిషత్ ఇలాంటి మేనేజ్‌మెంట్ వివరాలు కూడా సక్రమంగా నమోదు చేయలేదని తెలుస్తోంది. కొన్ని మున్సిపాలిటీల్లో ఇష్టారాజ్యంగా చైర్మన్లు సైతం ప్రమోషన్లు ఇచ్చినట్లు అధికారులు గుర్తించారు. తప్పుల తడకగా ఉన్న ఆ డేటాను చూసిన విద్యాశాఖాధికారులు తలలు పట్టుకుంటున్నారు. మున్సిపల్ ఆర్డీ నుంచి మున్సిపల్ టీచర్ల సమాచారం విద్యాశాఖకు పూర్తిస్థాయిలో అంద లేదు. దీనికితోడు పలు డీఎస్సీల సమాచారం కూడా అధికారుల వద్ద అందు బాటులో లేదు. ఇలా పలు కారణాల వల్ల టీచర్ల సమగ్ర వివరాల సేకరణ జిల్లా విద్యాశాఖాధికారులకు తలనొప్పిగా మారింది. పకడ్బందీగా సీనియారిటీ జాబితా సేకరణ కోసం క్షేత్రస్థాయి నుంచి డేటా సేకరణకు కసతర్తు చేస్తున్నారు. టీచర్ల డీఎస్సీ హాల్ టికెట్ నెంబర్లు సేకరించి, ఎంప్లాయీ ఐడీని ట్యాగ్ చేయనున్నారు. మొత్తం డేటా సేకరించిన తర్వాత తర్వాత సీనియారిటీ జాబితాను సిద్ధం చేసి కమిషనర్‌కు పంపనున్నారు. ఈనెల 10 తేదీలోపు పూర్తి చేయాలని విద్యాశాఖ డైరెక్టర్ డెట్‌లైన్ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో డేటా కొరవడంతో ఈ ప్రక్రియ మరింత జాప్యం అయ్యే అవకాశం ఉన్నట్లు విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

సమష్టిగా అధిగమిద్దాం

- వేసవి సమస్యలపై ప్రణాళికలు సిద్ధం చేయండి: జేసీ


సమీక్షలో మాట్లాడుతున్న జేసీ శివనారాయణశర్మ

అనంతపురంటౌన్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా సమష్టిగా అధిగమిద్దామని జా యింట్ కలెక్టరు శివ నారాయణశర్మ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో అధికారులతో 2024 -25లో జిల్లాలో సంభవించే అవకాశం ఉన్న వివిధ సమస్యలపై ఆయన శుక్రవారం సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ కరువు సంభవించి నపుడు ప్రజలను ఆసమస్యల నుంచి ఎలా సంరక్షించుకోవాలన్న అంశంపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. రానున్న వేసవిలో ఏర్పడే పరిస్థితులను అధిగమించడానికి ప్రతిశాఖ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అవసరమైనపుడు డ్రోన్ల ద్వారా కూడా సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. వేసవిలో నీటివనరులు ఎండిపోయి వ్యవసాయం, తాగునీటిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుందన్నారు. ఈసమస్యల నుంచి గట్టెక్కడానికి తగిన చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు. కార్యక్రమంలో డీఆర్ఓ మలోల, ఎస్డీఆర్ ఎఫ్‌సీఐ గోపాలక్రిష్ణ, వివిధశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తచెరువు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు కరాటే శిక్షణ ఇచ్చేందుకు గుర్తింపు పొందిన సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డీఈఓ కిష్టప్ప శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ జిల్లా పరిషత్, ప్రాథమికోన్నత, ఆదర్శ మున్సిపాలిటీ పాఠశాలల్లో విద్యార్థినులకు కరాటే నేర్పించాల్సి ఉంటుందని తెలిపారు. గుర్తింపు ధ్రువపత్రాలతో ఈ నెల పదో తేదీలోగా బుక్కపట్నంలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని డీఈఓ సూచించారు. మరిన్ని వివరాల కోసం అడిషినల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సెల్ నంబర్ 9985972599లో సంప్రదించాలని సూచించారు.

టమోటా కిలో రూ.13

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 13తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శుక్రవారం 750 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 10, కనిష్ఠ ధర రూ. 7 పలికినట్లు ఆయన తెలిపారు.

న్యూస్ బాక్స్

అందుబాటులో గుండెపోటు ఇంజెక్షన్‌లు

●కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వారికి అందించే ఇంజెక్షన్‌లు అందుబాటులో ఉన్నాయని సీకేపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి జయలక్ష్మి తెలిపారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం స్టెమీ గుండెకు భరోసా కార్యక్రమంలో భాగంగా రోగులకు, వైద్యసిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ... ఛాతీనొప్పి, ఎడమ భుజం లాగడం, గుండెదడ, స్పృహ కోల్పోవడం తదితర లక్షణాలుంటే గుండెపోటుగా గుర్తించాలన్నారు. రెండు గంటల్లోగా రోగిని స్థానిక ఆస్పత్రికి తీసుకురావాలన్నారు. స్థానిక సీకేపల్లి ప్రభుత్వాస్పత్రిలో ఈ ఇంజెక్షన్‌లు అందుబాటులో ఉంటాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యులు రాజశేఖర్‌రెడ్డి, మాధవి, రమేశ్, తేజ్‌దీప్, మండల వైద్యాధికారి రవీనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల బాలిక అనంతలో అదృశ్యం

● కళాశాలకు వచ్చిన కొంతసేపటికే...

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణానికి చెందిన ఓ బాలిక అనంతపురంలో అదృశ్యమైంది. నగర శివారులోని ఓ కాలనీలో తన తాత వాళ్ల ఇంట్లో ఉంటూ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ సెకండియర్ ఎంపీసీ చదువుతోంది. రోజూ ఆ బాలికను తాత కళాశాల వద్ద దింపి వెళ్లేవాడు. శుక్రవారం కూడా ఆ బాలికను ఆమె తాత వచ్చి కళాశాలలో దింపి వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో భోజనం తీసుకొచ్చిన ఆ తాతకు బాలిక లేదని చెప్పడంతో ఆందోళనతో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నాయీబ్రాహ్మణుల సమస్యలపై మంత్రికి వినతి



మంత్రి సవితకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేషన్ సభ్యులు

శింగనమల, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ సభ్యులు కలసి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. విజయవాడలోని బీసీ సంక్షేమ భవన్‌లో శుక్రవారం బీసీ కులాల కార్పొరేషన్‌ల చైర్మన్లు, డైరెక్టర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, డైరెక్టర్లు విజయ్ కుమార్, కొలవలి వేణుగోపాల్‌తో కలిసి నాయీ బ్రాహ్మణుల సమస్యలపై మంత్రికి వినతి పత్రం అందజేసినట్లు ఆ కార్పొరేషన్ డైరెక్టర్లు ఎం.ఆదినారాయణ, కడియాల కొండన్న తెలిపారు.

కంది కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ధర్మవరపు మురళి

రాప్తాడు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంది కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి పేర్కొన్నారు. మండలంలోని మరూరు టోల్ గేటు వద్ద గోడౌన్‌లో శుక్రవారం కంది కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కందులను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన రైతులకు తక్కువ కాలం లోనే ఖాతాల్లో డబ్బు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏఓ శ్రీవాణి, మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ సాకే తిరుపాలు, ఎంపీటీసీ జాఫర్ ఖాన్, మాజీ కన్వీనర్ నారాయణస్వామి, రైతులు పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరా బంద్

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నగరపరిధిలోని సబ్‌స్టేషన్లు, 11కేవీ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్తు శాఖ టౌన్-1 డీఈఈ చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 8:45 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. గాంధీనగర్, మున్నానగర్, రాణీనగర్, అంబేడ్కర్ నగర్, సుభాష్‌నగర్ మెయిన్‌రోడ్డు, అరవిందనగర్, విద్యుత్ నగర్, సాయినగర్, అశోక్‌నగర్, హౌసింగ్‌బోర్డు, భైరవనగర్, గౌరవగార్డన్, ఐదు, ఆరు రోడ్లు, ఎంజీ బ్యాంక్ సైడ్, ఎఫ్‌డీఆర్ టౌన్, మారుతీనగర్, రాం నగర్‌లలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. జాకీర్‌కొట్టాల, విద్యానగర్, గౌతమి విల్లాస్, అజయ్‌ఘోష్‌కాలనీ, వికలాంగుల కొట్టాల, ఆలమూరు రోడ్డు, చంద్రబాబు కొట్టాల, ఏఎండీ ఫంక్షన్ హాల్, పీవీకేకే కాలేజీ ప్రాంతం, పంతుల కాలనీ, వేణుగోపాల్ నగర్, నీరుగంటి స్ట్రీట్, నిర్మలానందనగర్ తదితరులు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

శైలజానాథ్ చేరికతో వైసీపీలో సంబరాలు

శింగనమల, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి సాకే శైలజానాథ్ వైసీపీలో చేరడంతో శింగనమలలలో ఆయన వర్గానికి చెందిన వైసీపీ శ్రేణులు అంబేడ్కర్ విగ్రహం, వైస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాల వేసి నివాలర్పించారు. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. నాయకులు పూల ప్రసాద్, దాసరి వెంకటరమణ, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, నియోజక వర్గం సమన్వయకర్త వీరాంజనేయులు, ఆలూరు సాంబశివారెడ్డి వర్గీయులు పాల్గొనలేదు. వైసీపీలోకి శైలజానాథ్ రావడాన్ని సాంబ వర్గం వ్యతిరేకిస్తున్నట్లు చర్చలు జరుగుతున్నాయి.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

● అక్కంపల్లి వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు



ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న ఆర్ఐ, వీఆర్వో

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ మోహన్ కుమార్ హెచ్చరించారు. మండలంలోని అక్కంపల్లి పరిధిలో రాచానపల్లి సర్వే నంబర్ 43-6లో ఉన్న ప్రభుత్వ భూమిలో ఆర్ఐ సందీప్‌కృష్ణ, వీఆర్వో శుక్రవారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... 43-6లో రెండెకరాల వంక పొరం బోకు భూమి ఉందన్నారు. గతంలో కొంత మంది భూమిని ఆక్రమించి పట్టాలు సృష్టించినట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. గ్రామస్థులు రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేయడంతోపాటు కలెక్టర్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారన్నారు. ఈక్రమంలోనే భూమిలో హెచ్చరికల బోర్డు ఏర్పాటు చేశామన్నారు.

అద్భుతంగా మోడల్ కాలనీ...

అధ్వానంగా జగనన్న కాలనీలు

● అప్పులపాలయ్యాం: లబ్ధిదారులు



గత టీడీపీ హయాంలో నిర్మించిన ముక్తాపురం మోడల్ కాలనీ



కనగానపల్లిలో అసంపూర్తిగా ఉన్న జగనన్న కాలనీ

కనగానపల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నాడు-నేడు అంటూ గత వైసీపీ ప్రభుత్వం అరకొర పనులు చేపట్టి ప్రచారహోరు సాగించింది. ఇళ్లు కాదు ఊళ్లు కడుతున్నామని ప్రకటన లిచ్చారు. ప్రతి పేద సొంతింటి కల నెరవేరుస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మరో ముందడుగు వేసి ప్రతి లబ్ధిదారుడికి తానే స్వయంగా ఇల్లు కట్టించి, తాళాలు చేతికిస్తానని చెప్పి... అసంపూర్తిగా ఇళ్లను నిర్మించారు. దీంతో పేదల సొంతింటి కల నెరవేరక అప్పులపాలయ్యారు. జగనన్న కాలనీలు మొండిగోడలతో దర్శనమిస్తున్నాయని, గతంలో టీడీపీ ప్రభుత్వం నిర్మించిన మోడల్ కాలనీ నేటికీ ఆదర్శంగా ఉందని జనం అంటున్నారు.

గత టీడీపీ హయాంలో...

ఇప్పుడు శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలంలో జాతీయ రహదారి పక్కన ఉంది ముక్తాపురం. గత టీడీపీ హయాంలో గ్రామంలోని రైతులు, కూలీల విన్నపం మేరకు అప్పుడు మంత్రిగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే పరిటాల సునీత గ్రామానికి 134 ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. వాటిని లాటరీ పద్ధతిలో అందజేసి ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. ఒక్కో ఇంటికి ప్రభుత్వం రూ1.50 లక్షలు మంజూరు చేసింది. అన్ని వసతులతో కూడిన ఇల్లు కట్టుకోవడానికి ఆ మొత్తం సరిపోకపో వడంతో బ్యాంకుల ద్వారా రూ25 వేలు రుణాన్ని ఇప్పించి నిర్మాణాలను మూడు నెలల్లో పూర్తి చేశారు. ఆదర్శంగా కాలనీలు నిర్మాణానికి శ్రమించిన అప్పటి హౌసింగ్ అధికారులను కేంద్ర ప్రభుత్వం స్కాచ్ అవార్డులతో సత్కరించింది. ముక్తాపురంలో మోడల్ కాలనీని ప్రారంభించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ ఇళ్లను చూసి ఒక రోజు బస చేయాలని ఉందని లబ్ధిదారులతో అన్నట్లు గ్రామస్థులు తెలిపారు. పేరుకు తగ్గట్టుగానే మోడల్‌కాలనీలో అన్ని వసతులు కల్పించారు. గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పార్కులు అధ్వానంగా తయారయ్యాయి.

మొండిగోడలతో జగనన్న కాలనీలు

గత వైసీసీ ప్రభుత్వంలో జగనన్న కాలనీలు పూర్తి స్థాయిలో నిర్మించక అధ్వానంగా తయారయ్యాయి. మండలంలోని కనగానపల్లి, వేపకుంట, తూంచెర్ల, బద్దలా పురం గ్రామాల్లో 162 ఇళ్లను మంజూరు చేశారు. 42 పూర్తికాగా మిగిలినవి పునాది, మొండిగోడలతో దర్శనమిస్తున్నాయి. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి చెందిన రాంక్రీట్ సంస్థ అసంపూర్తిగా ఇళ్లను నిర్మించి లబ్ధిదారులను నిండా ముంచేసిందని పలువురు అంటున్నారు. దీంతో కొందరు అప్పులు చేసి ఇళ్లను నిర్మించుకున్నారు.

అప్పు చేసి ఇల్లు కట్టుకున్నా



నాకు సొంతిల్లు లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇంటిపట్టాతో పాటు ఇళ్లు మంజూరు చేశారు. ప్రభు త్వమే ఇల్లు నిర్మిస్తుందని చెప్పడంతో సంబర పడిపోయా. మాకు మంజూరైన ఇంటి బిల్లులు కాజేసి అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. దీంతో అప్పులు చేసి ఇల్లు కట్టుకున్నా ఇప్పటికీ రంగులు వేయకుండానే ఇంట్లో ఉంటున్నాం.

-ఆంజనేయులు, కనగానపల్లి

మోడల్ కాలనీలో ఇల్లు కట్టి ఇచ్చారు



మాకు సొంతిళ్ల లేకపోవడంతో గత టీడీపీ ప్రభుత్వంలో ఇంటి పట్టాతోపాటు ఇల్లు నిర్మించి ఇచ్చారు. మాకు ఆర్థిక భారం కాకుండా ప్రభుత్వం, పరిటాల సునీతమ్మ ప్రత్యేక చొరవతో గృహాలు నిర్మించారు. అన్ని వసతులు కల్పించడం ఆనందంగా ఉంది.

-జి. నారాయణమ్మ, ముక్తాపురం

అంగన్‌వాడీల పనితీరు మారాలి

● ఎమ్మెల్యే దగ్గుపాటి హెచ్చరిక



ఐసీడీఎస్ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అర్బన్ నియోజకవర్గం పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది పనితీరు మారకపోతే చర్యలు తప్పవని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ హెచ్చరించారు. ఆయన శుక్రవారం నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మ, సీడీపీఓలు లలిత, ధనలక్ష్మి, సూపర్‌వైజర్లతో సమావేశమయ్యారు. అర్బన్ నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై ఆరా తీశారు. నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు సరిగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రాల్లో కార్యకర్తలు ఉండకుండా ఆయాల మీద వదిలేసి వెళుతున్నారని, ఇది ఏ మాత్రం సరి కాదన్నారు. కొన్ని కేంద్రాల్లో ఆయాలకు పనులన్నీ అప్పగించి కార్యకర్తలు విధులకు హాజరు కావడం లేదనే విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. కోడి గుడ్లు, చిక్కీలు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను ఎక్కడా చూడటం లేదన్నారు. గర్భిణులు, పిల్లలపై కొందరు దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. అంగన్‌వాడీల పనితీరులో మార్పు రావాలని, ఆ మేరకు అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫొటోలు కచ్చితంగా ఉండాలన్నారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, కొత్త భవనాల కోసం స్థల సేకరణ, నిర్మాణాలకు సంబంధించిన నివేదికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు కొండమ్మ, విష్ణువర్ధిని, విజయలక్ష్మి, లీలావతి, ఝాన్సీ, విజయశ్రీ పాల్గొన్నారు.

ఎంపీపీగా కర్రెన్న బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు తీసుకున్న ఎంపీపీని సన్మానిస్తున్న దృశ్యం

రామగిరి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీపీగా పేరూరు-1 ఎంపీటీసీ సభ్యుడు , మండల ఉపాధ్యక్షుడైన కర్రెన్న శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీపీగా ఉన్న మీనిగ నాగమ్మ మృతిచెందడంతో ఉపాధ్యక్షు డికి ఎంపీపీగా పదవీ బాధ్యతలు అప్పగిస్తూ సీఈఓ ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఎంపీడీఓ చంద్రమౌళి, సిబ్బంది ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా టీడీపీ పలువురు నాయకులు కర్రెన్నను అబినందించారు. పార్టీలకు అతీతంగా మండల అభివృద్ధికి సహకరించాలన్నారు. అనంతరం ఎంపీపీకి శాలువాలు కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామ్మూర్తినాయుడు, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, పరంధామయాదవ్, మండల కన్వీనర్ సుదాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, పేరూరు డ్యాం సాగునీటి సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, శ్రీధర్‌నాయుడు, సుబ్బరాయుడు, పేపర్ శీన, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, అక్కులప్ప, ఎంపీటీసీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాల బ్రోచర్ల విడుదల

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మొదటిరోడ్డులోని కాశీ విశ్వేశ్వరాలయంలో నిర్వహించనున్న శివరాత్రి బ్రహ్మోత్సవాల బ్రోచర్లను శుక్రవారం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ చేతులమీదుగా, ఆయన కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఈ నెల 19 నుంచి మార్చి 1వ తేదీ వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల్లో స్వామివారికి రోజుకొక వాహన సేవతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రమేష్, ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, నరేంద్రచౌదరి, దాడి శ్రీనివాస్, రజక ఫెడరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, టీడీపీ నాయకులు మల్లికార్జున, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆటోమొబైల్ షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పలు ఆటోమొబైల్ షాపుల్లో విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో స్థానిక రుద్రంపేట లోని ధన్వి హోండా సర్వీసెస్, స్పేర్స్ సెంటర్, కమలానగర్‌లోని కృష్ణ ఆటో మొబైల్స్‌లో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా పలు లోపాలను గుర్తించినట్లు డీఎస్పీ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వాహణ ఉండటంతో లీగల్ మెట్రోలజీ యాక్ట్ ప్రకారం ఒక్కొక్క షాపు నుంచి రూ.25 వేలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. తనిఖీల్లో సీఐ జమాల్ బాషా, సద్గురుడు, ఏఓ వాసుప్రకాష్, డీసీటీఓ విజయలక్ష్మి, లిగల్‌మెట్రాలజీ అధికారి గౌస్ పాల్గొన్నారు.

పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఎస్పీ పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను ఎస్పీ జగదీష్ శుక్రవారం పరిశీలించారు. సీపీసీ క్యాంటీన్, రామాల యం, షాదీఖానా, ఈ సర్వేలెన్స్ సెంటర్, పీసీఆర్, డయల్-100 విభాగాలను సందర్శించారు. ఆయా విభాగాల అధికారులు, సిబ్బందితో మాట్లాడి కార్యక్రమాలు అమలవుతున్న తీరుపై ఆరా తీశారు. సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, సీఐలు క్రాంతికుమార్, దేవానంద్, జిల్లా పోలీస్ అధికారుల సంఘం సాకే త్రిలోక్‌నాథ్, హరినాథ్, తేజ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు తీరిన దాహం

ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు



ఎస్సీ హాస్టల్‌లో మరమ్మతులు చేయించిన వాటర్ ప్లాంట్



ఆర్వోప్లాంట్ కొళాయి ద్వారా మినరల్ వాటర్ తాగుతున్న విద్యార్థినులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి)

నగరంలోని గిల్డాఫ్ సర్వీస్ స్కూల్ పక్కనున్న ఎస్సీ ప్రీమెట్రిక్ బాలికల వసతిగృహంలోని విద్యార్థినుల తాగునీటి కష్టాలు తీరాయి. సంవత్సర కాలంగా ఆర్వోప్లాంట్ మరమ్మతులకు రావడంతో విద్యార్థినులకు నీటి కష్టాలు మొదలయ్యాయి. దీంతో విద్యార్థినులు కొళాయి నీరు, బయటి నుంచి తీసుకొచ్చే మినరల్ వాటర్ తాగుతూ ఇబ్బందులు పడ్డారు. దీనికి తోడు వసతిగృహానికి నిర్వహణ ని ధులు లేకపోవడంతో ప్లాంట్ మరమ్మతులను ఎవరూ పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలోనే కూటమి ప్రభుత్వం ఏర్పడగానే నిధులు రావడంతో వసతి గృహాలకు మరమ్మతులు చేపట్టారు. మరమ్మతులు పూర్తయిన వసతి గృహాలను ప్రారంభించేందుకు గత నెలలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ వచ్చారు. విద్యార్థినులు తాగునీటి కష్టాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వాటర్‌ప్లాంట్ మరమ్మతులు చేయిస్తానని మాటిచ్చారు. ఆ మేరకు సొంత నిధులు రూ. 40 వేలతో వసతిగృహంలోని తాగునీటి ఆర్వో ప్లాంట్ మరమ్మతులు చేయించారు. దీంతో తాగునీటి కష్టాలు తీరాయని వసతిగృహం వార్డెన్‌తో పాటు విద్యార్థినులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన బాలస్వామి



నూతన కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న డిప్యూటీ కమిషనర్, ఆర్వో

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నగర కమిషనర్‌గా బాల స్వామి శుక్రవారం బాధ్య తలు చేపట్టారు. ఏలూరు కార్పొరేషన్ కార్యద ర్శిగా ఉన్న ఆయనను అనంతపురం నగరపాలక సంస్థ కమిషనర్‌గా నియమించారు. ఇదివరకు కమిషనర్‌గా ఉన్న నాగరాజు దీర్ఘకాలిక సెల వులోకి వెళ్లడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జ్ కమిషనర్‌గా రామలింగేశ్వర్‌ను నియమించారు. ఆయన కూడా సెలవులోకి వెళ్లడంతో ప్రభుత్వానుపత్రి అడ్మినిస్ట్రేటర్‌గా ఉన్న మల్లికార్జునరెడ్డి ఇన్‌చార్జ్ కమిషనర్‌గా కొనసాగారు. నూతన కమిషనర్ బాలస్వామికి డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆర్వోలు విజయ్ కుమార్, లక్ష్మీదేవి, అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కమిషనర్ బాలస్వామి తొలిరోజు విభాగాల ఉన్నతాధికారులతో కలిసి మాట్లాడారు. కార్పొరేషన్‌లోని కొన్ని విభాగాలను పరిశీలించారు.

ఎమ్మెల్యేని కలిసిన కమిషనర్ : కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం కమిషనర్ బాలస్వామి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిశారు. నగరపాలక సంస్థలో అవినీతి లేకుండా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలపై సీరియస్‌గా దృష్టి సారించాలన్నారు. పారిశుధ్య విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ బదిలీ

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సెలవులో ఉన్న నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రామలింగేశ్వర్‌ను బదిలీ చేశారు. కమిషనర్‌గా ఉన్న నాగరాజు దీర్ఘకాలిక సెలవులోకి వెళ్లిన సమయంలో, అడిషనల్ కమిషనర్‌గా ఉన్న రామలింగేశ్వర్‌ను ఇన్‌చార్జ్ కమిషనర్‌గా నియమించారు. కానీ ఆయన కూడా జనవరిలో సెలవులోకి వెళ్లారు. ఈనెల 2వతేదీ వరకు సెలవు పెట్టారు. ఎవరైనా కమిషనర్‌గా వస్తే అడిషనల్ కమిషనర్‌గా ఆయన విధుల్లో చేరతారని ప్రచారం జరిగింది. ఈ క్రమంలో రామలింగేశ్వర్‌ను రాజమహేంద్రవరం అడిషనల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రతిపంటకు గిట్టుబాటు ధర కల్పిస్తాం

● ఎమ్మెల్యే పరిటాల సునీత



కందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే పరిటాలసునీత అన్నారు. మండల కేంద్రమైన రామగిరిలో శుక్రవారం కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్, వ్యవసాయశాఖ అధికారులు, టీడీపీ స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు విషయాలపై రైతులతో చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... కందుల కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి పంట కొన్న తరువాత నిర్ణీత గడువు కంటే ముందుగానే వారి ఖాతాల్లోకి డబ్బు జమ అవుతుందన్నారు. అధికారులు రైతులకు పూర్తిగా సహకరించాలన్నారు. రైతులు దళారీల చేతిలో మోసపోకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామ్మూర్తినాయుడు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, పరంధామయాదవ్, మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, పేరూరు డ్యాం సాగునీటి సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, శ్రీధర్‌నాయుడు, సుబ్బరాయుడు, పేపర్‌శీన, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, అక్కులప్ప, ఎంపీటీసీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నాగరాజు (ఫైల్)

శింగనమల, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సి. బండమీదపల్లి సమీపంలో ద్విచక్ర వాహనాన్ని, గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మంగళ నాగరాజు(38) అనే వ్యక్తి మృతి చెందాడు. సి.బండమీదపల్లి కి చెందిన మంగళ నాగరాజు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. శనివారం సాయంత్రం పోతురాజుకాలువ గ్రామంలో ఓ ఫంక్షన్ ఉడడంతో తన ద్విచక్రవాహనంలో వెళ్లి రాత్రి 9గంటల సమయంలో తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. సి. బండమీదపల్లి వద్ద రోడ్డు బ్రిడ్జి పనులు జరుగుతున్న ప్రాంతంలో నాగరాజు ద్విచక్ర వాహనాన్ని తాడిప్రతి నుంచి అనంతపురం వెళ్లే గుర్తుతెలియని వాహనం ఢీ కొంది. ద్విచక్రవాహనం దాదాపు 10 మీటర్లు ఎగిరిపడడంతో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రత్నమ్మ, కుమార్తె ఉన్నారు. శింగనమల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసున్నారు.

నాగసముద్రం సమీపంలో మరో మహిళ...

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగసముద్రం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. నార్పలకు చెందిన గంగమ్మ(45) అనే మహిళ తన కుమారుడు మంజునాథ్‌తో కలిసి ద్విచక్రవాహనంలో నార్పల నుంచి హిందూపురం వెళ్తోంది. నాగసముద్రం క్రాస్ సమీపంలో గంగమ్మ ద్విచక్రవాహనం నుంచి జారి కిందకు పడింది. దీంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. మృతురాలికి భర్త ఈశ్వరయ్య, కుమారుడు ఉన్నారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

170 మందికి ఉచిత వైద్య పరీక్షలు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీకి చెందిన 170 మంది సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆర్టీసీ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం అనంతపురం డిపో గ్యారేజీ ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 170 మంది ఆర్టీసీ సిబ్బంది పాల్గొని గుండె, దయాబెటిస్, కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమున్న వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు మురళీకృష్ణ, నిరంజన్‌రెడ్డి, ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆర్ఎంఓ హేమలత, బస్టాండు మేనేజర్ కేఎస్ మూర్తి, ఎస్టీఐ రామాంజనేయులు, ఎంఎఫ్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

సంక్షిప్త వార్తలు

రేషన్‌బియ్యం వదిలేయడంపై విచారణ

ఉరవకొండ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని పట్టణంలోని పోలీసులు పట్టుకుని వదిలేయడంపై ఎస్పీ సీరియస్ అయినట్లు సమాచారం. ఈ ఘటనపై విచారణ చేయాలని డీఎస్పీ శ్రీనివాస్‌ను ఆదేశించారు. రేషన్‌బియ్యాన్ని వదిలేయడంపై ప్రమేయం ఉన్న పోలీసులను గుంతకల్లు డీఎస్పీ కార్యాలయానికి పిలిపించి విచారించినట్లు తెలుస్తోంది. వారి ద్వారా స్టేట్‌మెంట్ నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

రైళ్లను ఆపాలని వినతి

యాడికి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువు రైల్వే స్టేషన్‌లో చెంగల్‌పట్టు నుంచి కాచిగూడకు, ధర్మవరం నుంచి మచిలీపట్నంకు వెళ్లే రైళ్లను ఆపాలని గుంతకల్లు డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తాకు టీడీపీ నాయకులు, లయన్స్‌క్లబ్ సభ్యులు విన్నవించారు. స్థానిక రైల్వేస్టేషన్‌కు శుక్రవారం వచ్చిన డీఆర్‌ఎంను వారు కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. గతంలో ఈ రైళ్లను ఇక్కడ ఆపేవారని, కరోనా నుంచి ఆపడం లేదని తెలిపారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా రైళ్లను ఈ స్టేషన్‌లో ఆపాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సూర్యనారాయణ ఉన్నారు.

గ్యాస్ లీకై కిరాణాషాపు దగ్ధం

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగసముద్రం గ్రామంలో సీతమ్మకు చెందిన కిరాణా దుకాణంలో శుక్రవారం వంటగ్యాస్‌లీకై మంటలు చెలరేగాయి. దీంతో దుకాణం దగ్ధమైంది. సీతమ్మ కిరాణా దుకాణంలోనే బజ్జీలు వేసి విక్రయించేది. ఈ క్రమంలో మధ్యాహ్నం బజ్జీలు వేస్తుండగా గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. తేరుకున్న ఆమె వెంటనే బయటికి వచ్చేసింది. స్థానికులు గుర్తించి మంటలను ఆర్పారు. అప్పటికే షాపులోని ఫ్రిజ్ తినబండారాలతో పాటు రూ.25వేల నగదు మంటల్లో కాలిపోయాయి. దాదాపు రూ. లక్ష నష్టం వాటిల్లిందని బాధితురాలు వాపోయింది.

పోస్టర్లు విడుదల

ఉరవకొండ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నులిపురుగుల నివారణ దినోత్సవ పోస్టర్లను అధికారులు విడుదల చేశారు. ఈ నెల 10వ తేదీన నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు డాక్టర్ వినీత తెలిపారు. ఇందులో 18ఏళ్లలోపు వయసు గల పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలను వేయనున్నట్లు చెప్పారు. ఈవోఆర్డీ సతీష్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, సూపర్‌వైజర్ శేఖర్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 21 మంది ఎంపిక

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరంపల్లి వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం సీడప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. జెప్టో, బ్లిస్ కిట్, ఉడాన్, కీర్తి మెడికల్స్, రిలయన్స్, నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు చేశారు. 48 మంది పాల్గొనగా 21 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

కళాక్షేత్రానికి స్థలం కేటాయించాలని వినతి

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి):పట్టణంలో కళాక్షేత్రం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దారుకు ప్రజా నాట్యమండలి, సీపీఐ నాయకులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి మాట్లాడుతూ.. కళాకారులకు వేదిక లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇందుకు కళాక్షేత్రం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని పలుమార్లు అధికారులకు విన్నవించామని, ఇంతవరకూ ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా కళాక్షేత్రానికి స్థలం కేటాయించాలని కోరారు. ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి పీసీ కుళ్లాయప్ప, సీపీఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్, మండల కార్యదర్శి రాము, సహాయ కార్యదర్శి రామాంజనేయులు, ప్రజా నాట్యమండలి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పుల్లయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

వైసీపీ మండల కన్వీనర్‌గా హనుమంతరాయుడు

శెట్టూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల నూతన కన్వీనర్‌గా మండలకేంద్రానికి చెందిన ఎంఎస్ హనుమంతరాయుడు నియమితులయ్యారు. విజయవాడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఈ మేరకు నియామకపత్రాన్ని అందజేసినట్లు ఆయన చెప్పారు.

భూ రీసర్వే తనిఖీ

బెళుగుప్ప, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : మండలంలో తగ్గపర్తిలో చేపడుతున్న భూ రీ సర్వేను ఆర్డీవో వసంతబాబు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ.. రైతులకు సమాచారమిచ్చి.. వారు అంగీకారం తెలిపితేనే భూముల్లో రీసర్వే చేపట్టాలని సూచించారు. తహసీల్దార్, ఆర్ఐ , వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు. .

జొన్న పంటకు నిప్పు


కాలిపోయిన జొన్నపంట

ఉరవకొండ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం పొట్టిపాడు గ్రామంలో రైతు హనుమంతుకు చెందిన జొన్న పంటకు శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. మంటలు పెద్దఎత్తున వ్యాపించి పంట మొత్తం కాలి బూడిదైంది. రైతు హనుమంతు 3 ఎకరాల్లో జొన్న పంటను సాగు చేశాడు. రెండు ఎకరాల్లో పంటను కోసి పొలంలోనే కుప్పలు పోశాడు. ఆ కుప్పలకు నిప్పు పెట్టడంతో మొత్తం కాలి బూడిదయ్యాయి. రూ.80వేల వరకూ నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయారు.

గడ్డివాములు దగ్ధం


దగ్ధమవుతున్న గడ్డివాములు

శెట్టూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలేడు గ్రామ పంచాయతీ రంగయ్యపాలెంలో రైతు బోయ బడుగే కిష్టప్పకు చెందిన రెండు గడ్డివాములకు శుక్రవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో సుమారు ఎనిమిది బండ్ల వేరుశనగ పొట్టు, రెండు బండ్ల రాగి గడ్డి కాలి బూడిదయ్యాయి. స్థానికులు గుర్తించి మంటలు ఆర్పేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. సుమారు పది బండ్ల పశుగ్రాసం దగ్ధమైందని, రూ. మూడు లక్షల మేర నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయారు. సంబంధిత అధికారులు ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధిత రైతును ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

అసౌకర్యాల నడుమ వారపు సంత

● సుంకం వసూళ్లలో ఇష్టారాజ్యం

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వారపు సంతలో కనీస వసతులు లేక చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూరగాయలు, పండ్లు వివిధ రకాల వ్యాపారాలు చేసేందుకు గతంలో టీ సర్కిల్ సమీపంలో షెడ్లు వుండేవి. వాటిని పూర్తిగా తొలగించారు. వాహనాలు నిలుపుకోవడానికి ఆ స్థలాన్ని వినియోగిస్తున్నారు. కూరగాయలు కొనుగోలు కోసం స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. తాత్కాలిక దుకాణాలు పెట్టుకున్నందుకు వ్యాపారుల నుంచి ఇష్టారాజ్యంగా సుంకం వసూలు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం వారపు సంత పన్ను వసూళ్ల నుంచి మున్సిపాల్టీకి దాదాపు రూ.6 లక్షలు ఆదాయం వస్తున్నా కనీస సౌకర్యాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిరు వ్యాపారులు ఉదయం మార్కెట్ యార్డులో వ్యాపారం చేసుకుంటూ మధ్యాహ్నం సమయానికి బళ్లారి మిట్టమీద వున్న ఖాళీ స్థలంలో నిర్వహిస్తున్నారు. అక్కడ కూడా పెట్టనివ్వకుండా అధికారులు ఇబ్బంది పెడుతుండంతో మార్కెట్ యార్డులోనే రాత్రి 9 గంటల వరకు నిర్వహించాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ యార్డు పట్టణానికి చివరలో వుండటంతో చుట్టుపక్కల గ్రామస్థులు, పట్టణం ప్రజలు రావడానికి దాదాపు రెండు నుంచి మూడు కిలోమీటర్లు ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు రాత్రి సమయంలో మార్కెట్ యార్డులో వెలుతురు, నీటి సౌకర్యం లేక వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.


కనీస సౌకర్యాలు లేని వారపు సంత


సంతలోకి అనుమతించకపోవడంతో రోడ్డుపై నిలిచిన వాహనాలు

వెలగని వీధిలైట్లు

● అంధకారంలో కూడేరు ప్రధాన రహదారి


వెలుగని విద్యుత్ లైట్లు

కూడేరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో చీకటి పడగానే అంధకారం అలముకుంటోంది. వీధిలైట్లు ఏ ఒక్కటి కూడా పని చేయడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు వాటి స్థానంలో కొత్తలైట్లను ఏర్పాటు చేయలేదు. కనీసం వాటినే మరమ్మతు కూడా చేయించలేదు. దీంతో వెలుగులు లేక రాత్రి సమయంలో ప్రధాన రహదారి అంతా చీకటిమయమవుతోంది. నిత్యం వదలాది వాహనాలు రాకపోకలు జరుగుతున్న ప్రదేశంలో విద్యుత్ వెలుగులు లేకపోవడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు ప్రధాన రహదారి పక్కనే హోటళ్లు, కిరాణా, మెడికల్ తదితర షాపులు ఉండటంతో చీకట్లో దొంగల బెడద కూడా ఉండే అవకాశం ఉంటుందని పలువురు చెబుతున్నారు. గతంలో పలు షాపుల్లో దొంగలు పడ్డ సంఘటనలు ఉన్నాయంటున్నారు. వీధిలైట్లు లేక దాదాపు రెండు నెలలు అవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని, ఇప్పటికై అధికారులు స్పందించి ప్రధాన రహదారిలో వీధిలైట్లను మరమ్మతు చేసి వినియోగంలోకి తేవాలని వారు కోరుతున్నారు.


చీకటిమయమైన ప్రధాన రోడ్డు

చురుగ్గా నిర్మాణ పనులు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆ కాలనీలో డ్రైనేజీ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. గమనించిన ఆ వార్డు సీపీఐ కౌన్సిలర్ లక్ష్మి ఇటీవల సమస్యను టీడీపీ ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణస్వామి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన తక్షణమే డ్రైనేజీ కాలవ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. అదేవిధంగా పనులను కూడా వెంటనే ప్రారంభించారు. దీంతో నాగసముద్రం బావి నుంచి పార్క్ వరకు జనరల్ ఫండ్ కింద రూ. 10లక్షల వ్యయంతో 150 మీటర్ల మేరకు డ్రైనేజీ కాలువ పనులు ప్రారంభించారు. ఇంకా మిగిలిన 150 మీటర్ల మేర డ్రైనేజీ నిర్మాణానికి ఎస్టిమేషన్ వేశారు.


చురుగ్గా సాగుతున్న డ్రైనేజీ కాలువ పనులు

స్టెమీపై అవగాహన

గుంతకల్లుటౌన్/ రాయదుర్గం రూరల్: ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి గుండెకు సంబంధించిన చికిత్స స్టెమీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎవరికైనా ఛాతిలో నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మికంగా ఆయాసం, గుండె దడ రావడం, స్పృహకోల్పోడం వంటివి జరిగితే తక్షణమే మొదటి గంటలోపు ప్రభుత్వ ఆసుపత్రికి రావాలన్నారు. రూ. 45వేలు విలువజేసే టెనిక్టెప్లాస్ ఇంజక్షన్ ఉచితంగా అందించి ఉపశమనం కల్పిస్తామన్నారు. ఇప్పటి వరకు 92 మందికి ఇంజక్షన్లు వేసి ప్రాణాలు కాపాడామన్నారు. ఇంటింటికీ వెళ్లి స్టెమి గుండెకు భరోసా కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలకు సూచించారు. అనంతరం అందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. మెడికల్ అధికారి డాక్టర్ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే రాయదుర్గం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలోనూ వైద్యాధికారిణి మెర్సి జ్ఞానసుధ స్టెమీపై అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చినపుడు రోగి చనిపోయే పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం టెనెక్టెప్లాస్ ఇంజెక్షన్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. గుండెపోటు వచ్చిన వెంటనే ఈ ఇంజక్షన్‌ను వేసుకుంటే గంట వరకు సదరు వ్యక్తికి ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం చేయించుకుంటే గుండెపోటు నుంచి బయట పడవచ్చని ఆమె పేర్కొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపులపర్తి పంచాయతీ గోవిందయ్యదొడ్డి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త, మాజీ వైస్ ప్రెసిడెంట్ రామదాసు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. దీంతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాల మేరకు టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు గోవిందయ్య దొడ్డికి చేరుకుని రామదాసు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అలాగే కుటుంబ సభ్యులను పరామర్శించి టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

కంప్యూటర్ కోర్సులు ప్రారంభం

గుంతకల్లు, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌కేపీ డిగ్రీ కళాశాలలో సీ ప్లస్, సీ ప్లస్ ప్లస్ కంప్యూటర్ కోర్సులను శుక్రవారం ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మయ్య పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ కంప్యూటర్ విద్యను అభ్యసించాలని సూచించారు. నెలన్నరపాటు కంప్యూటర్ కోర్సుపై శిక్షణ ఇచ్చి తర్వాత పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్‌ను ప్రదానం చేస్తామని చెప్పారు. కెనరా బ్యాంకు మేనేజరు ఇమ్రాన్ ఖాన్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఓబులేశు, తదితరులు పాల్గొన్నారు.

ఇది పేదల వ్యతిరేక బడ్జెట్ : సీపీఐ

తాడిపత్రి ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల వ్యతిరేక బడ్జెట్ అంటూ సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ.. కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పేదలకు, వ్యవసాయానికి ఊరట కలిగించేలా లేదన్నారు. సంపన్నులకే ఎక్కువ ఉపయోగపడేలా ఉందన్నారు. అనంతరం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. నాయకులు రాజారెడి, రంగయ్య చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

చెత్తతో సంపద తయారీ కేంద్రాల పరిశీలన

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంతకల్లు, గోవిందవాడ, కళ్లుదేవనహళ్లి, శ్రీధరఘట్ట గ్రామాల్లోగల చెత్తతో సంపద తయారీ కేంద్రాలను అధికారులు శుక్రవారం పరిశీలించి వాటిల్లోకి వానపాములు వదిలారు. బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం నుంచి వానపాములను తెప్పించినట్లు ఈఓపీఆర్డీ దాస్ తెలిపారు. ఈ కేంద్రాల్లో వానపాములతో నాణ్యమైన సేంద్రియ ఎరువును తయారు చేయనున్నట్లు చెప్పారు. సర్పంచ్ ముక్కన్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

విడపనకల్లు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద కొట్టాలపల్లికి చెందిన రైతు పప్పూరు రవి(35) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. రవికి సొంత పొలం పది ఎకరాలు ఉంది. దీనికి తోడు 40 ఎకరాలను కౌలుకు తీసుకుని.. కంది, పప్పుశనగ సాగు చేశాడు అన్నారు. ఐదేళ్లుగా పంట దిగుబడి సరిగా రాకపోవటంతో అప్పులు రూ.20 లక్షలకు పైగా పేరుకుపోయాయి. ఈ ఏడాదైనా కాలం కలిసొస్తుందని భావించాడు. కానీ కంది పంట ఎకరానికి రెండు క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. పప్పుశనగ ఎకరాకు మూడు నుంచి నాలుగు క్వింటాళ్లు వచ్చింది. దీంతో పెట్టుబడులు కూడా తిరిగి రావని తీవ్ర ఆవేదనకు లోనయ్యాడు. మరోవైపు రుణదాతల ఒత్తిడి ఎక్కువైంది. దిక్కుతోచని స్థితిలో శుక్రవారం రాత్రి ఇంట్లో విషపు గుళికలను మింగాడు. కుటుంబ సభ్యులు గమనించిన ఉరవకొండ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


పప్పూరు రవి(ఫైల్)

ట్రాన్స్‌కో ఏఈగా రవీంద్ర

యల్లనూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) మండలకేంద్రంలో శుక్రవారం ట్రాన్స్‌కో ఏఈగా రవీంద్ర బాధ్యతలు స్వీకరించారు. ఈయన కడప జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన పద్మనాభరెడ్డి ఏడీఏ కార్యాలయానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే రవీంద్ర స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిశీలించారు.

నేడు జక్కలవడికికి విప్ రాక

కణేకల్లు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కలవడికి గ్రామానికి ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు శనివారం రానున్నట్లు స్థానిక టీడీపీ నాయకులు హనుమంతప్ప, రఘునాథ్‌రెడ్డి, ఎర్రిస్వామి శుక్రవారం తెలిపారు. గ్రామంలో జరిగే వన్నూరుస్వామి ఉత్సవాల్లో కాలవ పాల్గొనున్నట్లు చెప్పారు.

వైసీపీ నాయకుల సంబరాలు

పుట్లూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి సాకే శైలజానాథ్ వైసీపీలో చేరడంతో మండలంలోని ఆ పార్టీ నాయకులు శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. ఈ మేరకు మండలకేంద్రంతోపాటు కడవకల్లు గ్రామంలో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టపాసులు కాల్చారు. నాయకులు విష్ణునారాయణ, రామ్మోహన్, సూర్యనారాయణ, సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రూపు రుణాలకు దరఖాస్తు చేసుకోండి

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేదర, కుమ్మరి కులాలకు చెందిన వారు ముగ్గురు లేదా ఐదుగురితో గ్రూపు ఏర్పడి సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ విజయభాస్కర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం బీసీ కార్పొరేషన్‌లకు సబ్సిడీ రుణాలు మంజూరు చేసిందని, అందులో భాగంగా మేదర, కుమ్మరి కులాలకు చెందిన వారు మూడు లేక ఐదుగురితో ఉన్న గ్రూపులకు సబ్సిడీ రుణాలకు అవకాశం కల్పించిందని చెప్పారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గడువు పొడిగింపు

కణేకల్లు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం గడువు పొడిగించినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మండలంలో బీసీ కార్పొరేషన్‌కు 51, ఈబీసీకి 2, కమ్మ కార్పొరేషన్‌కు 1, కాపు కార్పొరేషన్‌కు 8 చొప్పున మొత్తం 62 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. వీటి కోసం అర్హులు ఆన్‌లైన్‌లో 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. గతంలో 7వ తేదీని ఆఖరని ప్రకటించినప్పటికీ పలు కారణాలతో గడువును 12వ తేదీకి పెంచినట్లు చెప్పారు.

చిరుత దాడిలో ఆవు మృతి

శెట్టూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కైరేవు గ్రామంలో గురువారం రాత్రి గాజుల ఎర్రిస్వామి తోటలో ఉన్న ఆవుపై చిరుత దాడి చేసింది. దీంతో ఆవు అక్కడిక్కడే మృతి చెందింది. పాడి ఆవు మృతి చెందడంతో ఉపాధి కోల్పోయానని, అటవీశాఖ అధికారులు స్పందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరారు. అలాగే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో చోరీ

గుత్తి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తురకపల్లి రోడ్డులో నివాసమున్న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి తిప్పయ్య ఇంట్లో చోరీ జరిగింది. రెండురోజుల క్రితం తిప్పయ్య ఇంటికి తాళం వేసి కుటుంబసమేతంగా హైదరాబాద్‌కు వెళ్లారు. శుక్రవారం తెల్లవారుజామున తిరిగి వచ్చి చూడగా.. ఇంటి తాళాలు పగిలిపోయి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువా ధ్వంసమైంది. అందులో ఉన్న రెండున్నర తులాల విలువజేసే బంగారు కమ్మలు, ఉంగరం కనిపించకపోవడంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చోరీపై పోలీసులకు ఫిర్యాదు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మైనార్టీ కాలనీలో ఖలీల్ బాషా అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. ఈ మేరకు బాధితుడు శుక్రవారం కసాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మూడు రోజుల క్రితం ఖలీల్‌బాషా పని నిమిత్తం విజయవాడకు వెళ్లాడు. అతడి భార్య పుట్టింటికి వెళ్లింది. అతను శుక్రవారం ఇంటికి రాగా తాళాలు ధ్వంసమై కనిపించాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా.. బీరువాలో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. అందులోని 20 తులాల వెండి ఆభరణాలు, మూడు గ్రాముల బంగారు నగలు, రూ.2వేల నగదు కనిపించలేదు. దీంతో అతను వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సులభతరమైన పనులివ్వాలని వినతి

కుందుర్పి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో దివ్యాంగులకు సులభతరమైన పనులు చేసే వెసలుబాటు కల్పించాలని పలువురు దివ్యాంగులు శుక్రవారం మండలకేంద్రంలో ఎంపీడీవో లక్ష్మీ నరసింహకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 1200 మంది దివ్యాంగులు ఉన్నారన్నారు. వారిలో 800 మంది జాబ్‌కార్డు కలిగి ఉన్నారన్నారు. కష్టతరమైన పనులు చేయడం దివ్యాంగులకు ఇబ్బందిగా మారిందన్నారు. దీంతో చాలామంది ఉపాధి పనులు చేయలేక మానుకున్నారన్నారు. కనుక దివ్యాంగులకు సులభమైన పనులు కేటాయించాలని కోరారు. దివ్యాంగులు వెంకటేష్, మల్లిస్వామి తదితరులు పాల్గొన్నారు.

సింహవాహనంపై ఊరేగిన రంగనాథుడు


సింహవాహనంపై కొలువుదీరిన స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు

గుత్తిరూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడులో గల బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ఉదయమే ఆలయంలో మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి సమయంలో ఉత్సవ మూర్తులను సింహవాహనంపై కొలువు దీర్చి గ్రామ పుర వీధుల్లో మేళాతాళాల మధ్య ఊరేగించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రంగస్వామిరెడ్డి యాదవ్, అర్చకులు పాల్గొన్నారు.

వైభవంగా వాసవీమాత విగ్రహ ప్రతిష్ఠ


వాసవీకన్యకాపరమేశ్వరి దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందవాడ గ్రామంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. మూడురోజుల పాటు విశేషంగా పూజల అనంతరం విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. తెల్లవారుజామున 5.30 గంటలకు ప్రత్యేక పూజలు, హోమాల అనంతరం వాసవి కన్యకాపరమేశ్వరిదేవి, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, నాగేశ్వర విగ్రహాలను ప్రతిష్ఠ చేశారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పామిడిలో నవగ్రహాలు..


దత్తాత్రేయ ఆలయంలో హోమం చేస్తున్న అర్చకులు

పామిడి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అనఘా ఆత్రేయ దత్త పాదుకా క్షేత్రం(దత్తాత్రేయ ఆలయం)లో శుక్రవారం మైసూరు దత్త పీఠం పురోహితులు శంకరదత్త శర్మ బృందం ఆధ్వర్యంలో నవగ్రహాల ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తొలుత ఆలయంలో దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదమంత్రోచ్ఛారణల నడుమ హోమాలు నిర్వహించి కలశ స్థాపన, మండప ఆరాధన, నవగ్రహ మూల మంత్ర జపం, ప్రతిష్ఠ చేశారు. ఈ నవగ్రహాలను ఆయా గ్రహ వాహనాలతో పాటు సతీమణులతో సహా ప్రతిష్ఠించడం విశేషం. స్థానిక ఎన్టీఆర్ కాలనీ సమీపంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పెద్దమ్మ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అర్చకుడు మహాదేవయ్య తొలుత అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు.

కందుల కొనుగోలు కేంద్రాల ప్రారంభం

బ్రహ్మసముద్రం/ పుట్లూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బ్రహ్మసముద్రం మండల కేంద్రంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, మాజీ కన్వీనర్ రాజశేఖర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో వీటిని ప్రారంభించినందని తెలిపారు. కందులకు కనీస మద్దతు ధర రూ.క్వింటాల్‌కు 7550 రూపాయలు ప్రకటించినట్లు చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీవో నందకిషోర్, వివిధ శాఖల అధికారులు, రైతులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే పుట్లూరు మండలకేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు ఏఓ కాత్యాయని తెలిపారు.

అప్పుల బాధతో ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య

కణేకల్లు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) అప్పుల బాధ భరించలేక ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఏఎస్ఐ శంకర్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని హనకనహాళ్ గ్రామానికి చెందిన గోవిందరాజులు(42) ట్రాక్టర్ డ్రైవర్ గా జీవనం సాగించేవాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమార్తె ఐశ్వర్య అనంతపురంలో బీటెక్ చదువుతోంది. రెండో కుమార్తె ఇంటర్ మధ్యలోనే ఆపేసి ఇంటిలో ఉంటోంది. కాగా కుమార్తెల చదువుకోసం, కుటుంబ పోషణ కోసం గోవిందరాజులు రూ. 3 లక్షల వరకు అప్పు చేశాడు. వడ్డీలు పెరిగిపోయి.. అప్పులు భారం అధికమైంది. దీంతో వాటిని తీర్చేమార్గంలేక శుక్రవారం గ్రామ శివారులో ఉన్న చెత్తతో సంపద తయారీ కేంద్రం షెడ్డులో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య రామాంజినమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఏఎస్ఐ తెలిపారు.

ముగిసిన శిక్షణ తరగతులు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో ఐసీటీ అకాడమీ, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న 60మంది విద్యార్థులకు గత 15రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. దీంతో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈసందర్భంగా కళాశాల డైరెక్టర్ గోపాల్ మాట్లాడుతూ నైపుణ్యం ఉన్నవారికే ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. విద్యార్థులు ఇలాంటి శిక్షణ తరగతులను వినియోగించుకుని నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. ఐసీటీ అకాడమీ నోడల్ ఆఫీసర్ ప్రవీణ్, కోఆర్డినేటర్ కురుపాటి రాకేష్, కళాశాల అకడమిక్ డైరెక్టర్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా వారోత్సవాలపై వ్యాసరచన పోటీలు

కుందుర్పి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం రోడ్డు భద్రతా వారోత్సవాలపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తర్వాత కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. రోడ్డు భద్రత వారోత్సవాలపై ప్రతి ఒక్కరికి పూర్తిస్థాయి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

శ్రీశైలంలో జేసీ కుటుంబం

తాడిపత్రి ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని శ్రీశైల పుణ్యక్షేత్రాన్ని జేసీ కుటుంబం శుక్రవారం సందర్శించారు. మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారికి బంగారు తాబేలు, పళ్లెం సమర్పించారు. మాజీ ఎంపీ జేసీ దివాకరరెడ్డి, మున్సిపల్ చెర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే జేసీఅస్మిత్‌రెడ్డి, జేసీ పవన్ కుమార్‌రెడ్డి ఇతర కుటుంబ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, అనుచరులు పాల్గొన్నారు.


అమ్మవారికి బంగారు తాబేలు, పళ్లెంను సమర్పిస్తున్న జేసీ కుటుంబసభ్యులు